**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

## ముగ్గురు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య..

థానే : మహారాష్ట్రలోని థానేలో దారుణం చోటుచేసుకుంది. ఒకే ఇంటికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. భర్త ఇంటికి తిరిగి వచ్చే సరికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉరి తాడుకు వేలాడుతూ కనిపించారు. ఈ సంఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్రలోని థానే.. భివాండికి చెందిన ఓ వ్యక్తి తన భార్య, ముగ్గురు పిల్లలతో అక్కడి ఓ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆ భర్త నైట్ షిఫ్ట్ చేస్తూ ఉన్నాడు. రోజూ లాగే శుక్రవారం రాత్రి కూడా నైట్ షిఫ్ట్‌కు వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చాడు. తలుపు లోపలినుంచి లాక్ చేసి ఉండటంతో.. భార్యను పిలిచాడు. స్పందన రాలేదు. తలుపు దగ్గర చప్పుడు చేశాడు. అయినా స్పందన రాలేదు. కిటికీ దగ్గరకు వెళ్లి లోపలికి చూశాడు. అక్కడి దృశ్యం చూసి షాక్ అయ్యాడు. అతడి గుండె పగిలినంత పనైంది. లోపల భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉరి తాడుకు వేలాడుతూ కనిపించారు. అతడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

సంపుటి : 1 | సంచిక : 273 | ఆదివారం 04-05-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.

# వాణిజ్యం బంద్

**పాక్ నుంచి అన్నిరకాల దిగుమతులపై భారత్ నిషేధం**

**ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులన్నింటికీ వర్తిస్తుందని స్పష్టీకరణ**

**ఇరు దేశాల మధ్య రూ.80 వేల కోట్లకుపైనే వాణిజ్యం**



న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్రదాడి, అనంతర పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ నుంచి అన్నిరకాల దిగుమతులను నిలిపివేస్తున్నట్టు భారత్ ప్రకటించింది. పాక్‌లో తయారైన, పాక్ నుంచి వచ్చే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులు ఏవైనా సరే ఈ నిషేధం వర్తిస్తుందని శనివారం స్పష్టం చేసింది. అంతేకాదు ఆ దేశం నుంచి వచ్చే కొరియర్లు, పార్సిళ్లు వంటివాటిని కూడా పూర్తిగా నిలిపివేస్తున్నట్టు తెలిపింది. మరోవైపు భారత్‌లోని అన్ని నౌకాశ్రయాల్లోకి పాక్‌కు చెందిన, పాక్ జెండా ఉన్న ఎలాంటి నౌకలు ప్రవేశించకూడదంటూ నిషేధం విధించింది. ఇదే సమయంలో భారత నౌకలేవీ కూడా పాకిస్థాన్ పోర్టులకు వెళ్లవద్దని సూచించింది. "ప్రత్యక్షంగా, పరోక్షంగా పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయిన, ఆ దేశం నుంచి ఎగుమతి చేసే అన్నిరకాల ఉత్పత్తులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతి ఉన్నవైనా, ఎలాంటి అనుమతీ అవసరం లేని ఉత్పత్తులు అయినా ఈ నిషేధం వర్తిస్తుంది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు ఇది అమల్లో ఉంటుంది. ఈ నిషేధం నుంచి ఏదైనా మినహాయింపు కావాలంటే.. ప్రభుత్వం నుంచి ముందుగానే అనుమతులు తీసుకోవాలి.." అని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) స్పష్టం చేసింది. జాతీయ భద్రత, ప్రజాప్రయోజనం నిమిత్తం ఈ చర్యలు తీసుకుంటున్నామని, తక్షణమే ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తాయని ప్రకటించింది. భారత్ నుంచి వచ్చే దిగుమతులను నిషేధిస్తూ పాకిస్థాన్ ఇప్పటికే ప్రకటించగా.. తాజాగా భారత్ నిర్ణయంతో ఇరు దేశాల మధ్య వాణిజ్యం పూర్తిగా నిలిపోయినట్లైంది.

**పరోక్ష దిగుమతులపైనా నిషేధంతో దెబ్బ..**

వాస్తవానికి పుల్వామా దాడి తర్వాత పాక్‌తో వాణిజ్యాన్ని భారత్ బాగా తగ్గించుకుంది. చాలా ఉత్పత్తులపై 200% కస్టమ్స్ సుంకాలు కూడా విధించింది. అయినా పళ్లు, నూనెగింజలు, ఔషధ మొక్కలు, బాదం, జీడిపప్పు వంటి డ్రైఫ్రూట్స్, రాగి ఖనిజం, గాజు ఉత్పత్తులు వంటి కొన్నిరకాల ఉత్పత్తుల దిగుమతులు మాత్రం నేరుగా జరుగుతున్నాయి. 2022–23లో భారత్ నుంచి పాక్‌కు సుమారు రూ.5,300 కోట్ల విలువైన ఎగుమతులు జరగ్గా.. పాక్ నుంచి దిగుమతుల విలువ సుమారు రూ.170 కోట్లు. అదే 2024–25 ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి పాక్‌కు ఎగుమతులు సుమారు రూ.3,700 కోట్లకు తగ్గిపోతే.. దిగుమతులు కేవలం రూ.4 కోట్లలోపే కావడం గమనార్హం. అయితే ఆంక్షలు, సుంకాల నుంచి తప్పించుకోవడానికి.. పాక్ నుంచి చాలా వరకు ఉత్పత్తులను దుబాయ్, సింగపూర్, శ్రీలంక, ఇండోనేషియా వంటి దేశాలకు తరలించి, ఆయా దేశాల ఉత్పత్తులుగా చూపుతూ భారత్‌కు పంపుతుంటారని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి.

ఇలా పరోక్షంగా వచ్చే పాక్ ఉత్పత్తుల విలువ సుమారు రూ.5 వేల కోట్ల వరకు ఉంటుందని అంటున్నాయి. ఇప్పుడు పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపైనా నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించడంతో.. పాకిస్థాన్‌లోని పలు రకాల పరిశ్రమలకు గట్టి దెబ్బపడుతుందని అంటున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి భారత్–పాకిస్థాన్‌ల మధ్య వాణిజ్యం విలువ రూ.84 వేల కోట్లకు పైనే ఉంటుందని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి.

### ఆ ఉగ్రవాదుల్ని

# వదిపెట్టం..

**స్పష్టం చేసిన ప్రధాని మోదీ**



**జమ్మూకాశ్మీర్ :** జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఉగ్రమూకల కాల్పుల్లో మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్ 22వ తేదీన జరిగిన ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం .. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే దిశలో చర్యలు మొదలెట్టింది. సరిహద్దుల దగ్గర యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదం గురించి తరచుగా స్పందిస్తూనే ఉన్నారు. శనివారం కూడా ప్రధాని మోదీ ఉగ్రవాదంపై మాట్లాడారు. ఉగ్రవాదులపై .. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంగోలా ప్రెసిడెంట్ జావో లూరెన్కోతో ఢిల్లీలో ఉమ్మడి ప్రెస్ కాన్ఫిరెన్స్ జరిగింది. ఈ ప్రెస్ కాన్ఫిరెన్స్ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'మానవాళి మనుగడకు టెర్రరిజం అతి ప్రమాదకరమైనదని రెండు దేశాలు నమ్ముతున్నాయి. టెర్రరిస్టులపై .. టెర్రరిజాన్ని సపోర్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న దృఢనిశ్చయంతో ఉన్నాము. సరిహద్దుల దగ్గర టెర్రరిజాన్ని అరికట్టడంతో మాకు సహకరిస్తున్నందుకు అంగోలాకు కృతజ్ఞతలు. దాదాపు రెండు దేశాలు 40 ఏళ్లుగా భాగస్వామ్యంలో కలిసి ముందుకు నడుస్తున్నాయి. అంగోలా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నపుడు.. ఇండియా నమ్మకం, స్నేహంతో అండగా నిలిచింది. ఆఫ్రికన్ దేశాల నుంచి మాకు గత పదేళ్లు ఎంతో వేగవంతమైన సహకారం అందింది. వ్యాపారం 100 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఎనిమిది దేశాల్లో ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లను తెరిచాము. ఓ ఐదు దేశాల్లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో సహకరిస్తున్నాము. ఆఫ్రికాలో 17 కొత్త ఎంబసీలను తెరిచాము' అని అన్నారు.

## పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి

**ప్రధాని మోదీకిఎంపీ ఆర్. కృష్ణయ్య వినతి పత్రం**



**రాంనగర్, మే 3 :** పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య వినతి పత్రం అందజేశారు. జనగణనలో కులగణన చేయడానికి కేంద్రం నిర్ణయం తీసుకున్నందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేసినట్లు తెలిపారు. విద్యానగర్ లోని బీసీ భవన్‌లో ఆయన శనివారం మాట్లాడుతూ.. ఏపీ పర్యటనకు వచ్చిన ప్రధానిని తాను కలిసి బీసీల డిమాండ్లపై వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 56 శాతం బీసీ జనాభా ఉందని వీరందరికి రాజ్యాంగ పరంగా విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తగిన వాటాను ఇచ్చేలా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. బీసీలందరూ చట్టసభల్లోకి రావాలంటే 50 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరినట్లు చెప్పారు. తమ డిమాండ్ల పట్ల ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించినట్లు ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. 40 ఏళ్లుగా తాను చేస్తున్న బీసీ పోరాటాన్ని ఆయన మెచ్చుకున్నట్లు చెప్పారు.

## ప్రమాద బాధిత కుటుంబానికి కేటీఆర్ అండ

**మలేషియాలో ఉన్న తండ్రి తిరుగు ప్రయాణానికి సాయం**



హైదరాబాద్, మే 3: నిర్మల్ జిల్లాకు చెందిన విద్యార్థినులైన అక్కాచెల్లెళ్లు బాణావత్ మంజుల, అశ్విని శుక్రవారం ఆర్మూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఆయన శనివారం ప్రకటనలో తెలిపారు. ఉపాధి కోసం వెళ్లి మలేషియాలో ఉంటున్న ఆ పిల్లల తండ్రి బాణావత్‌రెడ్డిని రాష్ట్రానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ అధికారులను ఆయన ఆదేశించారు. మలేషియాలోని భారత దౌత్యాధికారులతో సమన్వయం చేసి, ప్రయాణ అనుమతులు, టికెట్లు సహా అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కాగా, సీసీఐ పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేతలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగా, దేశవ్యాప్తంగా కుల గణనను శాస్త్రీయ ప్రమాణాలతో నిర్వహిస్తే సామాజిక న్యాయానికి విజయంగా నిలుస్తుందని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# వాయుసేనలో మోగిన భేరి

**• 45 లాంచర్లు... 85 విధ్వంసక మిస్సైళ్లు • టెండర్లు పిలిచిన రక్షణ శాఖ**




న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్ర దాడి అనంతర పరిణామాల్లో తమపై ఎప్పుడైనా భారత్ యుద్ధానికి దిగొచ్చునని దాయాది దేశం పాకిస్థాన్ భయపడుతోంది. దానికి తగినట్టే మనదేశ సైనిక నిర్ణయాలు యుద్ధ సన్నద్ధతను సూచిస్తున్నాయి. తాజాగా కొత్త తరం ఆయుధశక్తితో వాయు సేనను బలోపేతం చేసుకునేందుకు భారత్ సిద్ధమైంది. భుజంపై పెట్టుకుని ప్రయోగించడానికి వీలైన 45 లాంచర్లు, 85 మిస్సైళ్లు, 48 నైట్ విజన్ పరికరాల కొనుగోలుకు శనివారం టెండర్లు పిలిచింది. క్షణాల్లో శత్రు లక్ష్యాలను ఛేదించగలిగే విధ్వంసక శక్తి ఈ మిస్సైళ్లకు ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా సాయుధశక్తిని బలోపేతం చేసుకునేందుకు ఈ నిర్ణయం తీసకున్నామని సైనికవర్గాలు చెబుతున్నాయి. అయితే, పాక్‌తో తథ్యం అని భావిస్తున్న యుద్ధానికి దీనిని సన్నాహంగా మిలిటరీ నిపుణులు అనుమానిస్తున్నారు. భూతలానికి అతి సమీపంనుంచి, స్వల్ప దూరంనుంచి దాడులు చేసే శత్రు యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లను ఈ కొత్త తరం వాయు రక్షణ వ్యవస్థ ((వీఎసహెచ్‌వోఆర్ఏడీఎస్) కనురెప్పపాటులో నేలకూల్చగలదు. భూతలంపై పోరాడే సైన్యానికి రక్షణ కవచంగా ఉంటుంది. "గగనతలదాడుల నుంచి కాపాడే విధ్వంసక, రక్షణ వాయు వ్యవస్థ మనకు కావాలి. ఈ వ్యవస్థ ఇన్‌ఫ్రా రెడ్ హెూమింగ్ (ఐఆర్) టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. ఫైర్ అండ్ ఫర్గెట్ తరహా మిస్సైల్ వ్యవస్థ ఇది" అని టెండర్ నోటీసులో (ఆసక్తి వ్యక్తీకరణ) రక్షణ శాఖ తెలిపింది. ఈ మిస్సైళ్ల రేంజ్ ఆరువేల మీటర్లకు మించి ఉంటుంది.

### ఉపాధి పని దినాలు తగ్గించడం

# సరికాదు

**రైతు బీమాను నిర్వీర్యం చేయడం దుర్మార్గం: హరీశ్**



**హైదరాబాద్, మే 3:** ఉపాధి హామీ పథకం కోసం గత ఏడాదిలో 12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా ఈసారి కేవలం 6.5 కోట్లకే పరిమితం చేయడం సరికాదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని శనివారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. కేంద్రం వెంటనే పనిదినాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా, కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 మంది ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే.. ఆ కుటుంబం రోడ్డున పడకుండా కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఫిబ్రవరిలో కట్టాల్సిన రూ.775 కోట్ల ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రైతు కుటుంబాలకు శాపంగా మారిందన్నారు.

### కేఎల్‌హెచ్‌లో విద్యార్థులకు

# ప్లేస్‌మెంట్స్

**75 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు**

**ఘనంగా ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్**

**మొయినాబాద్ రూరల్, మే 3:** మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సంపూర్ణంగా అవగాహన చేసుకుంటే అత్యుత్తమ ఉద్యోగాలతో పాటు ఎటువంటి ఆందోళన లేకుండా కేరీర్‌ను పూర్తి చేసుకోవచ్చునని జేపీ మోర్గన్ కంపెనీ ఉపాధ్యక్షుడు మారియో డేవిడ్ పేర్కొన్నారు. కేఎల్‌హెచ్ యూనివర్సిటీలో శనివారం రాత్రి ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మారియో డేవిడ్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయని, వాటిపై నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది జర్మనీ, జపాన్, సింగపూర్, దుబాయ్ వంటి దేశాల్లో విద్యార్థులు అంతర్జాతీయ ప్లేస్‌మెంట్స్ దక్కించుకున్నారని తెలిపారు. మూడో ఏడాదిలోనే జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 500లకు పైగా కంపెనీలు క్యాంప్‌సకు వచ్చి విద్యార్థులను ఇంటర్వ్యూలు చేశాయని పేర్కొన్నారు. సృజనాత్మక నైపుణ్యం ఉన్న యువతకు కచ్చితంగా ప్రాధాన్యం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రణాళిక ప్రకారం చదువును కొనసాగించే విద్యార్థులకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారథివర్మ మాట్లాడుతూ.. ఈ ఏడాది రూ.75 లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో తమ విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. రూ.20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు వార్షిక ప్యాకేజీతో సూపర్ డ్రీమ్, డ్రీమ్ కంపెనీల్లో తమ విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల రామకృష్ణ, అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తలకు ధీమా సభ్యత్వ బీమా

**మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్**

**మేచ రాజు పల్లి కి చెందిన కార్యకర్త రాజు కుటుంబానికి రెండు లక్షలు చెక్కు అందజేత!**



**తొవ్వ, నెల్లికుదురు, మే 03**

బిఆర్ఎస్ కార్యకర్తలకు ధీమా పార్టీ సభ్యత్వం ద్వారా పొందే బీమా అని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం హనుమకొండలోని ఆయన స్వగృహంలో మండలంలోని మేచరాజుపల్లి గ్రామానికి చెందిన ముంజంపల్లి రాజు భార్య అనుష సంవత్సరం క్రితం మృతి చెందగా ఆమె పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నందున సభ్యత్వం ద్వారా పార్టీ అందించే బీమా 2 లక్షల చెక్కును బిఆర్ఎస్ యువజన విభాగం డివిజన్ ఉపాధ్యక్షులు కొమ్మినేని సందీప్ పటేల్, పిఏసిఎస్ డైరెక్టర్ కొయ్యడి వెంకటేశ్వర్లు గౌడ్, యూత్ నాయకులు పొన్నమనేని రజనీకాంతరావు లతో కలిసి చెక్కును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీల మహిళ కార్యకర్త అనూష ను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. కార్యకర్తల కుటుంబాలను ఆదుకునే లక్ష్యంతో సభ్యత్వ బీమా ఏర్పాటు చేసి లక్షలాది కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్న మహానేత కేసిఆర్ అన్నారు. కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోవద్దని, అధికార పార్టీ నేతలు ఎలాంటి కేసులు పెట్టిన పార్టీ వారిని రక్షించుకుంటుందని భరోసా కల్పించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో భరసా అభ్యర్థులు అత్యధికంగా విజయం సాధించడం ఖాయం అన్నారు. నియోజకవర్గంలో ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉండి కార్యకర్తలను కాపాడుకుంటానన్నారు.

## 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భూక్య రవి రాథోడ్**

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తాం**

**పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి**



**తొవ్వ, నెల్లికుదురు, మే 03**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భూక్య రవి రాథోడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని రికార్డులను తనిఖీ చేయడం తోపాటు ఆయా విభాగాలను పరిశీలించి, తగు సూచనలు సలహాలు చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో వైద్య సేవలు అందించే ఏఎన్ఎం ఆశా వర్కర్లను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రసవాలు ఎక్కువగా జరిగే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని లేనట్లయితే విధుల్లో నుంచి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ శారద, పి హెచ్ ఎన్ శాంతమ్మ , స్టాఫ్ నర్స్ పద్మ, ఫార్మసిస్ట్ సోమ్లా నాయక్, సిబ్బంది మక్బూల్ తదితరులున్నారు.

## భారత రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

**రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్న బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలి**

**కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ హెచ్ వెంకటేశ్వర్లు**




**తొవ్వ, నెల్లికుదురు, మే 03**

భారత రాజ్యాంగ రక్షణ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మాజీ చైర్మన్, మాజీ జెడ్పిటిసి హెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని హనుమాన్ నగర్ తండా, నైనాల, పార్వతమ్మ గూడెం గ్రామాల్లో ఏఐసీసీ పిలుపుమేరకు మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు గుగులోత్ బాలాజీ నాయక్ లతో కలిసి మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాలకు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను పరిపాలిస్తున్న కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. రాష్ట్రంలో కూల గణన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి భారతదేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో జరిగిన తీరును చూసి హడలిపోయిన బిజెపి జనగణనలో కుల గణన చేపడతామని చెప్పడం స్వాగతిస్తున్నామన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలలు కన్న బడుగుల రాజ్యం కాంగ్రెస్తోనే సాధ్యమన్నారు. నిస్వార్థ రాజకీయాలకు గాంధీ కుటుంబం చిరునామా అన్నారు. అనంతరం రాజ్యాంగ రక్షణకు అందరం కంకణ బద్ధులమై పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాగిరి యాక సాయిలు, మండల అధికార ప్రతినిధి మట్ట. వెంకటరెడ్డి, గ్రామ శాఖ ల అధ్యక్షులు యాసం యాకయ్య, గుగులోతు యాకూబ్ నాయక్, మట్ట యాకూబ్ రెడ్డి, ఇసంపల్లి వెంకటేష్, బెల్లి నరసయ్య, జిల్లా నాయకులు నాయిని శ్రీపాల్ రెడ్డి, వలబోజు వెంకటేశ్వర్లు, జిలకర యాలాద్రి, మండల నాయకులు ఆకుతోట సతీష్, గంకిడి ఎల్లారెడ్డి, మద్దెల సమ్మయ్య, ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు గుగులోతు దేవేందర్ నాయక్, జల్లక వీరయ్య, పెరుమాండ్ల జగన్ గౌడ్, పెరమాండ్ల సమరం గౌడ్, తోట యాకయ్య, తదితరులున్నారు.

## శ్రీ రాజ్య తండా గ్రామ శాఖ అధ్యక్షులు సుందర్ నాయక్‌ను పరామర్శించిన నేతలు



**తొవ్వ, నెల్లికుదురు, మే 03**

మండలంలోని ఉమ్మడి వావిలాల గ్రామ శివారు శ్రీ రాజ్య తండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్లావత్ సుందర్ నాయక్ సతీమణి రాజ్యలక్ష్మి ఇటీవలే రోడ్డు ప్రమాదం జరిగి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆమెను వారి స్వగృహంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి, మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ లు పార్టీ నేతలతో కలిసి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా యాక్సిడెంట్ జరిగిన తీరును సుందర్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చులు అందే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. త్వరగా ఆరోగ్యం కోలుకోవాలని మనసారా భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులున్నారు.

## పేద రోగులకు అపన్న హస్తం సీఎం సహాయనిధి

## కాంగ్రెస్ జిల్లా నేత నాయిని సత్యపాల్ రెడ్డి



**తొవ్వ, నెల్లికుదురు, మే 03**

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు అపన్న హస్తం సీఎం సహాయనిధి అని జిల్లా కాంగ్రెస్ నేత నాయిని సత్యపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆలేరులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామ శాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాలేరు మల్లేశంతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ముందుకెళు_న్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు సమీకరించడంలో తనదైన శైలిలో కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, త్రాగునీటి బోరు బావులు మంజూరు చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. చెరువుల మరమ్మత్తుల్లో అవాకులు, చెవాకులు పేలిన బారాస నేతలకు తగిన గుణపాఠం చెప్పేలా నిధులు తీసుకువచ్చి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నార న్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని రోగులు అధైర్య పడవద్దని వారికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఆలేరు చెరువు కట్ట మరమ్మతుకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నజీమ్, యుగంధర్, సుమన్ తదితరులున్నారు.

## ఘనంగా ఏఐవైఎఫ్ 66 వ ఆవిర్భావ దినోత్సవం




**యాదాద్రి జిల్లా :వలిగొండ: తొవ్వ ప్రతినిధి: మే 03**

వలిగొండ మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మారోజు నరసింహ చారి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శిలు మారోజు నరసింహాచారి, సుద్దాల సాయికుమార్ సంయుక్తంగా మాట్లాడుతూలి దేశ స్వాతంత్రోద్యమంలో యువకులను సమీకరించి వీరోచితమైన పోరాటం చేసిన ఏకైక యువజన సంఘం ఏఐవైఎఫ్ అని అన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తిని నింపుకొని నేటికీ అనేకమైన ఉద్యమాలు చేస్తూ,విద్య, వైద్య వ్యాపారాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, సమగ్ర యువజన విధానం కోసం, ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలని, భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్మెంట్ గ్యారెంటీ యాక్ట్ ను రూపొందించి, అమలు చేయాలని అన్నారు, నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని ఏ ఐ వై ఎఫ్ పోరాటాలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భూష శివ, చంద్రమౌళి, పూదూరు నరేష్ బాలగోని మచ్చగిరి, ప్రశాంత్, ఉయ్యాల మచ్చ గిరి, తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛాయుత మాధ్యమమే ప్రజాస్వామ్యానికి శక్తి

**ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు ఖాసిం వల్లి**



**చింతపల్లి తొవ్వ న్యూస్ :-**

ప్రభుత్వ బాధ్యతలను గౌరవంగా గుర్తు చేస్తూ, ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సమాజ హితం కోసం పనిచేస్తున్న పాత్రికేయులందరూ అభినందనీయులని చింతపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు షేక్ ఖాసిం వలి అన్నారు. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛ లోపించిన ప్రజాస్వామ్యం అసంపూర్ణం అన్నారు. కలం యోధుల గళానికి స్వేచ్ఛ ఉన్నప్పుడే పాత్రికేయులు నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందు, ప్రభుత్వం ముందు ఉంచగలరని, స్వేచ్ఛాయుత మాధ్యమమే ప్రజాస్వామ్యానికి శక్తి అని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయ వ్యక్తం చేశారు.

## బూరుగు లక్ష్మమ్మకు నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు



**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి :మే 03**

రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన నవ తెలంగాణ విలేఖరి బూరుగు వెంకటేశం మాతృమూర్తి బూరుగు లక్ష్మమ్మ శనివారం మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్, నాయకులు గోదాసు పృథ్వీరాజ్, సాల్వేరు లింగం, కోట సుధాకర్, బొడ్డు సాలయ్య, ఎండి అక్రమ్, ఎండి నాసర్, కొమ్ము శేఖర్, లెంకల ప్రవీణ్ , పల్లపు రవి, లవణం సాయి, బుర్రి ఉపేందర్, ఎండి అజార్ ,గంగాపురం శంకర్, ఎండి రిజ్వాన్ చిత్తరంజన్ దాస్ మున్ని తదితరులు పాల్గొన్నారు.

## అసమానతలు తొలగడానికే కులగణన


**మాజీ డిసిసి కార్యదర్శి తాటిపాముల శేఖర్ గౌడ్**



**యాదాద్రి జిల్లా రామన్నపేట తొవ్వ, మే 03:**

సామాజిక అసమానతలు తొలగడానికే ఈ కులగణన అని మాజీ డిసిసి కార్యదర్శి వెల్లంకి మాజీ ఎంపిటిసి తాటిపాముల శేఖర్ గౌడ్ అన్నారు. శనివారం నాడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగననకు కేంద్రం అనుకూలంగా చెప్పడం కాంగ్రెస్ పార్టీ విజయమని ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేసే జనాభా లెక్కల్లో కులగన చేస్తామనడం తెలంగాణ ప్రభుత్వ విజయం అని తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర సందర్భంగా సామాజిక అసమానతలు తొలగించడానికి దేశవ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేశారన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల గణన చేసి దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. కులఘనన విషయంలో కాంగ్రెస్ పార్టీ విజయంగా భావించినట్లు మాజీ డిసిసి కార్యదర్శి తాటిపాముల శేఖర్ గౌడ్ తెలిపారు.

## బూరుగు లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మే 03**

రామన్నపేట మండలంలోని నవతెలంగాణ విలేఖరి బూరుగు వెంకటేష్ తల్లి బూరుగు లక్ష్మమ్మ మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పట్టణ కేంద్రంలోని లక్ష్మమ్మ ఇంటికి వెళ్లి లక్ష్మమ్మ మృతదేహానికి నివాళు లర్పించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం,మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, వేమవరం సుధీర్ బాబు, గొరిగే నరసింహ, ఎండి ఆమీర్ జిల్లా నాయకులు కన్నబోయిన బలరాం ,పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు లవణం రాము ,రామిని లక్ష్మణ్, బొడ్డు అల్లయ్య ,ఎండి అజాజ్ ,పులిపలుపుల వీరస్వామి, బొడ్డుపల్లి రాజు, గుండాల రాంబాబు ,ఎండి మోసబ్ ,ఎండి అంజాద్,కుక్క సాయి, నాలిక శీను, కొమ్ము మచ్చగిరి ,ఆముద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జివో నెంబర్ 3 కు ప్రత్యామ్నాయం చూపాలని కూటమి ప్రభుత్వాన్ని కోరిన జనసేన పార్టీ, పాడేరు బొంకుల.దివ్యలత.



**అల్లూరి జిల్లా, పాడేరు తొవ్వ న్యూస్ మార్చి 03 :**

ఆదివాసీ నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చెయ్యాలని బొంకుల.దివ్యలత శనివారం మీడియా ముందు మాట్లాడుతూ,జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ మరియు అరకు పార్లమెంట్ ఇంచార్జ్ డా!! వంపూరు గంగులయ్య, అరకు జనసేన ఇంచార్జ్ శెట్టి.చిరంజీవి,పాడేరు టీడీపీ ఇంచార్జ్ గిడ్డి.ఈశ్వరి, అరకు ఇంచార్జ్ ఏ.పిఏస్ ఆర్టీసీ చైర్మన్ దొన్ను దొర, జి.సిసి చైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్, బీజేపీ పార్టీ ఇంచార్జ్ ఉమా మహేశ్వరరావు, మరియుకూటమి నాయకులు అందరూ జివో నెంబర్ 3 మీద ప్రతిపాదనలు వినతిలా రూపంలో ఇచ్చారని ఎవరు ఆందోళన చెందవద్దని ఆమె తెలిపారు. గిరిజన యువతకి తీవ్ర అన్యాయం చేసిన ఘనత గత వైకాపా ప్రభుత్వానిదని మండిపడ్డారు. జివో నెంబర్ 3 పై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ జివో నెంబర్3 ను ధర్మాసనం కొట్టి వేసిందని దీన్ని సవాల్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పిటిషన్ కూడా వేయకపోవడంతో గిరిజన నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందనీ తెలిపారు. జీవో నెంబర్ 3 ను పునరుద్దరించాలని కోర్టులో ప్రభుత్వం తరపున వాదనలు వినిపించి సాధించుకోవాలని లేదా ఆంధ్రప్రదేశ్ చట్ట తీర్మానం చేసి కేంద్రానికి పంపించి పునరుద్దరించుకోవాలని తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు జోస్యం చూసారని మండిపడ్డారు. మొదట్లో జివో నెంబర్ 3 తెచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని అన్నారు. ఈ విషయం గమనించాలని ఆమే అన్నారు. జివో నెంబర్ ఇచ్చాక అనేక సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని వివరించారు.వైకాపా ప్రభుత్వం యువతకి ఉద్యోగ్య అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోగా జివో నెంబర్ 3 పోతున్న అధికారంలో ఉంది కూడా రివ్యూ పిటిషన్ వెయ్యకుండా గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వం మీద బురద జల్లే విధంగా ప్రయత్నం చేస్తున్నారు అని ఆమే మండిపడ్డారు.అప్పటి వైసిపి ప్రజా ప్రతినిధులుగా ఉన్న కోటగుల్లి భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ,ఎస్టి కమిషన్ చైర్మన్ గా ఉన్న కుంభ రవిబాబు, ఎస్టి కమిషన్ మెంబర్ మత్స్యరస. విశ్వేశ్వర రాజు, డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాని అప్పుడు గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంటే నోరు మెదపకుండా జోస్యం చూస్తున్నారాని తెలిపారు.. ఇప్పుడు జివో నెంబర్ 3పై ఉద్యమాలు, పోరాటలంటూ చేస్తున్న హడావిడి చూస్తే గిరిజన నిరుద్యోగ యువతకు, గిరిజన ప్రజలకు మధ్య పెట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్న మిమ్మల్ని గిరిజన ద్రోహులు గానే పరిగణంలోకి తీసుకుంటున్నారు. అనే విషయం తెలియజేస్తున్నాం అని హర్షం వ్యక్తం చేశారు... ఇప్పటికైన మీకు చిత్తశుద్ధి ఉంటే మీకు నిజంగానే గిరిజన ప్రాంత ప్రజల మీద అపారమైన ప్రేమ అభిమానాలు ఉంటే అసెంబ్లీ కి వెళ్లి వాదించాలని డిమాండ్ చేశారు... ప్రజా సంఘాలు అందరికీ తెలియజేస్తున్నాం... కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యామ్మాయం జివో తీసుకొచ్చి మన ఆదివాసీ ప్రాంతానికి కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎవరు ఆందోళన చెందకండని తెలియజేశారు...దయచేసిఈ వైకాపా పార్టీ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని గమనించగలరు.. వీళ్ళను గిరిజన జాతి ద్రోహుల ను ఈ ఉద్యమాల్లో రానివ్వకండి మన పోరాటాల్లో న్యాయం ఉంది తప్పకుండా జనసేన పార్టీ తరపున కూటమి ప్రభుత్వం తరుపున మీకు అండగా ఉంటాం అని తెలిపారు.

## ఏజెన్సీ మండల అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యం

## మంత్రి సీతక్క




**మహబూబాబాద్ మే 3 తొవ్వ:**

మహబూబాబాద్ జిల్లా ములుగు నియోజకవర్గంలోని కొత్తగూడ గంగారం మండలాలను కచ్చితంగా ఇతర మండలాల వలే అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.అదేవిధంగా కొత్తగూడ గంగారం మండలాలలో దాదాపు అన్ని గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామని , త్వరలో మిగిలిన రోడ్లను కూడా ప్రతి గ్రామం లో గల్లీ గల్లీన నిర్మాణం చేపడతామని అన్నారు. గతంలో గంగారం మండల ప్రజలు భారీ వర్షాల కారణంగా వాగులు ఉధృతంగా ప్రవహించడంతో అనేక ఇబ్బందులు పడేవారని నేడు ఆ సమస్య లేకుండా బ్రిడ్జిలు కల్వర్ట్ ల నిర్మాణం, వెడల్పు రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు.కుల గణన చారిత్రాత్మక నిర్ణయం అని కుల గణనపై బిఆర్ఎస్ బిజెపి నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి సీతక్క ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, గంగారం మండల అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకర బోయిన మొగిలి, మాజీ జెడ్పిటిసి పుష్పలత, మాజీ ఎంపిపి విజయ రూప్ సింగ్,కొత్తగూడ మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్,కల్తి కొమ్మక్క ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మధ్యావర్థులు అవసరం లేదు

## నన్ను నేరుగా వచ్చి కలవచ్చు

**ప్రజా సమస్యల పరిష్కరించడం కోసమే అధికారులు**

**జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్**



**తొవ్వ ,మహబూబాబాద్ మే 03:**

పోలీస్ శాఖ అనేది ప్రజలకు సేవ చేయడానికి ఉండే ప్రజా సంస్థ అని . ప్రతి పౌరుడు తమ సమస్యలు, అభ్యర్థనలు, ఫిర్యాదులు నేరుగా పోలీస్ అధికారులకు తెలియజేసే హక్కు కలిగి ఉన్నారని . ఇందులో ఎటువంటి మధ్యవర్తులు, సిఫార్సుదారులు, లేదా ఎలాంటి ఇతర ప్రభావాలు అవసరం లేదని . జిల్లా ఎస్పీ ని కలవడానికి ఎవరైనా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయానికి రావచ్చుఅని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కెకెన్ పిలుపునిచ్చారు . శనివారం పత్రిక ప్రకటన వెలువడిస్తూ మేము ప్రజల అవసరాలను గౌరవించి, పారదర్శకమైన విధానాలతో స్పందించడానికి కట్టుబడి ఉన్నామని . జిల్లా పోలీసు కార్యాలయం ప్రతిరోజూ విధివిధానాల ప్రకారం ప్రజలకు అందుబాటులో ఉంటుందని . ప్రజలు తమ సమస్యలను స్వయంగా చెప్పగలగడం ద్వారా సమస్యల పరిష్కారం త్వరితగతిన జరుగుతుందన్నారు .మధ్యవర్తులు లేదా ఇతరులు ప్రజల సమస్యలను తప్పుగా లేదా వక్రీకరించిన విధంగా తెలియజేసే అవకాశం ఉందని అందువల్ల, ప్రజల సౌకర్యార్థం, న్యాయం అందించాలనే ఉద్దేశ్యంతో, ఎవరూ ఎటువంటి భయాందోళన లేకుండా నేరుగా ఎస్పీ ని కలవచ్చు.ని తెలిపారు పోలీసులు ప్రజల స్నేహితులుగా ఉండే విధంగా వ్యవహరించడమే మా లక్ష్యం గా జిల్లా పోలీసులు పనిచేస్తారని అన్నారు .

## ప్రజా ప్రతినిధులు అధికారులకు

# వంతపడేవారా..?

◆ ప్రజా సమస్యలపై కథనాలు రాసేవారా...? ◆ ఏది జర్నలిజం...? ఎవరు జర్నలిస్టు..?




ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుకోవడం తప్ప పత్రికలు జర్నలిస్టులకు కథనాలు రాయడానికి స్వేచ్ఛ ఎక్కడుంది...? ప్రజా ప్రతినిధులు అధికారులకు వంత పాడుతూ కథనాలు రాసేవారేనా..? జర్నలిస్టులు... లేక ప్రజా సమస్యలపై కథనాలు రాసే వారా జర్నలిస్టులు...? ఏది జర్నలిజం..? ఎవరు జర్నలిస్టు..? నిజానికి ప్రజా సమస్యలను వెలికి తీసి కథనాలు రాయడంతో పాటు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు చేరవేస్తూ చెడ్డ పనులను కూడా ఎత్తిచూపుతూ కథనాలు రాసేవారే నిజమైన జర్నలిస్టులు కానీ నేడు దానికి విరుద్ధంగా ప్రజాప్రతినిధులు అధికారులకు వంత పాడుతూ కథనాలు రాసే వారే జర్నలిస్టులుగా చలామణి అవుతున్నారు.

**ఒకప్పుడు మీడియా అంటే ప్రజలకు ధైర్యం..**

ఒకప్పుడు మీడియా అంటే ఒక భరోసా గా భావించేవారు ప్రజలు. ప్రజా వాక్కును ప్రపం చానికి వినిపిస్తూ.. ప్రభుత్వాలు చేసే తప్పులను నిర్భయంగా నిలదీస్తూ, అవినీతి పరులకు కొరకరాని కొయ్యగా ఉంటూ.. నిజాలను నిర్భయంగా ప్రజా కోర్టులో ఉంచుతూ.. ప్రజల పక్షానా.. ప్రజా ఆయుధంగా మీడియా ఉండేది. అందువల్ల ఇప్పటికీ కూడా ప్రజలు ప్రభుత్వాల కన్నా మీడియానే ఎక్కువ నమ్ముతారంటే అతిశయోక్తి కాదు. మరి అలాంటి మీడియా నేటిరోజుల్లో విశ్వసనీయత కోల్పోతుందా అంటే అవునని చెప్పక తప్పదు. ప్రభుత్వ, ప్రతిపక్ష పార్టీలకు కొమ్ము కాస్తూ విలువలను కుని చేస్తోంది నేటి మీడియా రంగం. మీడియా రంగంలో ప్రస్తుతం చూస్తే మూడు రకాలుగా మీడియాను విభజించి వాడుకుంటున్నారు ప్రజా ప్రతినిధులు అధికార వ్యవస్థ. ఇక 4వ రకం విలేఖరులు ప్రస్తుతం వారు అక్రమ సంపాదనే లక్ష్యంగా మీడియాను ఎంచుకుంటున్నారు వారి వల్ల మీడియాకు ఉన్న కాస్త మంచి పేరు కూడా భ్రష్టు పట్టిపోతుంది.

**అధికార ప్రభుత్వానికి భజన చేయడమే పనిగా మొదటి రకం మీడియా...**

మొదటి రకం మీడియా ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి అనుకూలంగా కొన్ని మీడియా సంస్థలు పని చేస్తున్నాయి. ప్రభుత్వ పాలన విధానంలోని లోటు పాట్లను పక్కన పెట్టి.. కేవలం ప్రభుత్వానికి భజన చేయడమే ప్రధాన ఎజెండాగా వ్యవహరిస్తూ ఉంటాయి. అలాంటి మీడియా సంస్థలను రద్దు చేయాలని ప్రజలు ప్రజాస్వామికవాదులు ప్రజా సమస్యలపై కథనాలు రాస్తే లేనిపోని కేసులలో ఇరికించి ఇబ్బందులకు గురి అవుతున్న అసలైన జర్నలిస్టులు కోరుకుంటున్నారు. ఇక 2వ రకం మీడియా విషయానికొస్తే.. ప్రభుత్వ పాలనలోని తప్పు ఒప్పులతో సంబంధం లేకుండా కేవలం తప్పులను మాత్రమే ప్రజలకు చూపిస్తూ.. ప్రతిపక్ష పార్టీకి మైలేజ్ తెచ్చే పనిలో మాత్రమే ఉంటాయి. మరి ఇలాంటి మీడియా సంస్థలను కూడా ఏరిపరేయాలని కోరుకుంటున్నారు.

ఇక ఇందులో మూడవ మీడియా కాస్త కూర్చో ఈ మూడవ మీడియాలో ప్రభుత్వ మంచి పనులను ప్రజలకు చేరవేస్తూ చెడ్డ పనులను ఎత్తిచూపుతూ ప్రజా సమస్యలను వెలికి తీసి కథనాలు రాసే పత్రికలు జర్నలిస్టులు చాలా తక్కువ అనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే కాస్తో కూస్తో ప్రజల పక్షాన నిలిచే పత్రికలను జర్నలిస్టులను లేనిపోని కేసులలో ఇరికిస్తూ కథనాలు రాసేందుకు వెనుకాడే విధంగా భయభ్రాంతులకు గురి చేస్తుంటారు.. దీని వల్ల నికార్సైన జర్నలిస్టులు కనుమరుగవుతున్నారని చెప్పవచ్చు.. ఇక 4వ మీడియా వీరు అక్రమ సంపాదన కోసమే పనిచేస్తూ వీరికి తప్పు ఒప్పులకు పనిలేదు వీరు ఎవరు డబ్బులు ఇస్తే వారిని జోకడం వీళ్ళ పని ఉదయం లేస్తే వీళ్ళ చేతిలో ఎవరో ఒకరు బకరా కావాల్సిందే ఎవరో ఒకరిని బకరా చేసి అక్రమ సంపాదన పోగు చేసుకుంటున్నారు.. ఇలాంటి వారి వల్ల కాస్త కూసో జర్నలిజం జర్నలిస్టులకు ఉన్న మంచి పేరు భ్రష్టు పట్టిపోయింది.

**ప్రజల పక్షాన నిలిచే మీడియా ఏదంటే చెప్పడం కష్టమే...!**

ప్రస్తుత తరుణంలో ప్రజల పక్షాన నిలిచే మీడియా జర్నలిస్టులు ఎవరంటే చెప్పడం కష్టమే ఎందుకంటే.. ఒక పట్టణంలో నలుగురు ఐదుగురు ప్రజల పక్షాన నిలిచి సమస్యలను వెలికి తీసి కథనాలను రాస్తున్న వారిని లేనిపోని కేసులలో ఇరికించి ప్రజా ప్రతినిధులు అధికార వ్యవస్థ వారికి ఎదురులేకుండా చేసుకుంటున్న నేటి రోజుల్లో మనకెందుకు వచ్చిన గొడవలే అని కొంతమంది జర్నలిస్టులు సమస్యలను గాలికి వదిలేస్తున్నారు. ఇక మరి ప్రజల పక్షాన నిలిచే మీడియా ఏది అంటే సమాధానం చెప్పడం కష్టమే అవుతుంది. ఇలా రాజకీయ పార్టీలకు కొమ్ము కాస్తూ ప్రజా విలువలను గాలికి వదిలేస్తున్నాయి. నేటి మీడియా సంస్థలు.. ఇదేనా అసలైన జర్నలిజం..? ప్రజలు ప్రశ్నిస్తున్నారంటే నేటి మీడియా రంగం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**అసలు జర్నలిస్టు నకిలీ జర్నలిస్టులెవరో చెప్పాల్సింది మీడియా అకాడమీ...!**

అసలు జర్నలిస్టులు ఎవరో నకిలీ జర్నలిస్టులు ఎవరో తేల్చాల్సింది మీడియా అకాడమీ కానీ వారికి ఇదేమీ పట్టదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మీడియా రంగాన్ని బలోపేతం చేస్తూ పార్టీలకు ప్రజాప్రతినిధులకు పత్రికలు మీడియా ఛానల్లు ఉండకుండా మీడియా అకాడమీ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఒకవేళ పార్టీలు, ప్రజాప్రతినిధులు మీడియా రంగంలో వేలు పెట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మేధావులు, కొన్ని పార్టీల నాయకులు ప్రజాస్వామికవాదులు ప్రజలు యువకులు కాస్తో కూస్తో నేటి సమాజంలో ప్రజా సమస్యలను వెలికి తీసి కథనాలు రాస్తున్న జర్నలిస్టులు కోరుకుంటున్నారు. ప్రభుత్వ మంచి పథకాలను ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలను వెలికి తీసి కథనాలు రాసే నికార్సయిన జర్నలిస్టులకు ఈ కథనం అంకితం...



కొమ్మనబోయిన యాకయ్య, తొర్రూరు
సీనియర్ జర్నలిస్ట్.
సెల్ 8639892200.

## గోవా ఆలయంలో తొక్కిసలాట

**ఆరుగురి మృతి, ఐదుగురి పరిస్థితి విషమం**

**పనాజీ, మే 3:** ఉత్తర గోవాలోని శిర్గావ్‌లో ఉన్న శ్రీలైరాయ్ ఆలయంలో జాతర సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున భక్తులు నిప్పుల గుండంలో నడిచే సమయంలో తొక్కిసిలాట చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా.. ఆరుగురు మృతిచెందారు. మరో 80 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గోవా ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజీత్‌రాణె వెల్లడించారు. తీవ్ర గాయాలపాలైన వారిని గోవా వైద్య కళాశాల(జీఎంసీ)లో చేర్పించినట్లు డీజీపీ అలోక్ కుమార్ తెలిపారు. ఏటా మే నెలలో శ్రీలైరాయ్ దేవీ జాతర జరుగుతుంది. ఈ ఉత్సవాలకు గోవాతోపాటు.. మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. శుక్రవారం సాయంత్రం జాతర మొదలవ్వగా.. భక్తులు క్రమంగా శిర్గావ్ చేరుకోవడం ప్రారంభించారు. తెల్లవారుజామున 3గంటలకు జరిగే అగ్నిగుండం వేడుక సమయానికి ఆ ప్రాంతంలో 40వేల మంది వరకు భక్తులున్నట్లు పోలీసులు తెలిపారు. “అగ్నిగుండం సమీపంలో ఓ వైపు ఉన్న ఏటవాలుగా ప్రాంతంలో ఎక్కువ మంది నిలబడ్డారు. భక్తులు అగ్నిగుండంలో నడుస్తున్న సమయంలో.. అటువైపు రద్దీ పెరిగింది. ఈ క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌కు ఫోన్ చేశారు. సీఎం సావంత్ ఉదయమే ఘటనాస్థలికి చేరుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.

## అనుమతిస్తే పాక్‌లో మానవబాంబుగా పేలుతా

**మంత్రి జమీర్ అహ్మద్ వ్యాఖ్యలు**

**బెంగళూరు, మే 3:** ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా అనుమతిస్తే ఆత్మాహుతి బాంబుగామారిపాకిస్థాన్‌లోఉగ్రవాదులను పేల్చేస్తానని కర్ణాటక వక్ఫ్, వసతి శాఖల మంత్రి జమీర్ అహ్మద్ అన్నారు. మీడియా ఎదుట శుక్రవారం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. ‘మేము భారతీయులం. హిందూస్థానీలం.పాకిస్థాన్‌తోమాకు ఎలాంటి సంబంధాలూ లేవు. కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే నా ఒంటికి బాంబును కట్టు కుని యుద్ధం కోసం పాకిస్థాన్ వెళ్లేందుకు సిద్ధం’ అని వ్యాఖ్యానిం చారు. ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ భారత్‌కు ఎప్పుడూ శత్రువులేనని జమీర్ అహ్మద్ పేర్కొన్నారు. పహల్గాంలో దాడి నీచమైనదంటూ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సమయంలో భారతీయులంతా సమైక్యంగాఉండాలని పిలుపునిచ్చారు.

## బీఎస్ఎఫ్ అదుపులో పాకిస్థానీ రేంజర్

**న్యూఢిల్లీ, మే 3:** సరిహద్దుల వద్ద విధులు నిర్వహించే పాకిస్థాన్‌కు చెందిన ఓ రేంజర్‌ను బీఎసఎఫ్ అదుపులోకి తీసుకొంది. రాజస్థాన్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నట్టు శనివారం అధికార వర్గాలు తెలిపాయి. గత బుధవారం పొరపాటున సరిహద్దు దాటిన బీఎసఎఫ్ కానిస్టేబుల్ పూర్ణం కుమార్ షాను పాకిస్థాన్ సైన్యం అదుపులోకి తీసుకొంది. అతడి సమాచారం ఏదీ ఇంకా వెల్లడి కాలేదు. ఎనిమిది రోజులుగా రెండు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఫలితం లేకపోయింది. దానికి ప్రతీకారంగానే పాక్ జవాన్‌ను బీఎసఎఫ్ అదుపులోకి తీసుకొంది. ఇరు దేశాల సైనికులు పొరపాటున సరిహద్దులు దాటడం సర్వసాధారణం. మిలటరీ అధికారులు చర్చలు జరిపి వారిని విడిచిపెడుతుంటారు. కానీ పహల్గాం దుర్ఘటన కారణంగా పాకిస్థాన్ జాప్యం చేస్తుండడంతో బీఎసఎఫ్ కూడా అదే రీతిలో వ్యవహరించింది.

## పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్‌కు

# 151వ స్థానం ఆందోళనకరం

ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛ సూచీలో 180 దేశాలలో భారత్ 151వ స్థానంలో పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, మాల్దీవుల కంటే దిగువ స్థానంలో ఉండటం బాధాకరమని సీసీజీజీఓఓ జాతీయ చైర్మన్ వి. కృష్ణ మోహన్ వాపోయారు. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదమని తెలిపారు. రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ అనే ప్రభుత్వేతర సంస్థ 2002 నుంచి ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచికను ప్రచురిస్తోందని,1993 నుంచి ప్రతియేటా 03 మే రోజున ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యునెస్కో "ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం" నిర్వహిస్తున్నప్పటికీ, ప్రపంచ పత్రికా స్వేచ్ఛ స్థితిని మొదటిసారిగా క్లిష్ట పరిస్థితిలో ఉన్నట్టు సూచిక వర్గీకరించిందని పేర్కొన్నారు. 1991లో పత్రికా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, బహువచన పత్రికారంగం కోసం "విండ్‌హక్ డిక్లరేషన్" చేసిన సందర్భానికి గుర్తుగా వరల్డ్ ప్రెస్ ఫ్రీడం డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత ప్రదర్శన ‘చాలా తీవ్రమైన’ వర్గంలోనే ఉన్నదని నివేదిక వివరించిందని, రాజకీయ దిగ్గజాల చేతుల్లో మీడియా యాజమాన్యం కేంద్రీకృతమై ఉన్న కారణంగా మీడియా బహుళత్వానికి ముప్పు వాటిల్లుతున్న దేశాల జాబితాలో భారత్ కూడా ఉండటం విచారకరమన్నారు.

2014లో ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ మీడియా ‘అనధికారిక అత్యవసర పరిస్థితి’లోకి పడిపోయిందని రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ ఆందోళన వ్యక్తం చేస్తూ బీజేపీ, మీడియాలో ఆధిపత్యం చెలాయించే పెద్ద కుటుంబాల మధ్య అద్భుతమైన సయోధ్యను రూపొందించిందని భారత్‌పై తన విభాగంలో వివరించటం గమనార్హం. ప్రధానికి సన్నిహిత స్నేహితులైన సంపన్న పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ 70కి పైగా మీడియా సంస్థలను కలిగి ఉన్నాడనీ, అదానీ గ్రూపు ఎన్డీటీవీని కొనుగోలు చేయటం ప్రధాన స్రవంతి మీడియాలో బహుళత్వానికి ముగింపుని సూచిస్తుందని మీడియా వాచ్‌డాగ్ రిపోర్టర్స్ సాన్స్ ఫ్రాంటియర్స్ వివరించింది. గోడీ మీడియాగా పిలవబడే బీజేపీ అనుకూల ప్రచారాన్ని చేసే మీడియా సంస్థలూ పెరిగాయని పేర్కొంటూ మీడియా విషయంలో ప్రధాని మోడీ తీరునూ వివరించింది. "ప్రధాని పత్రికా సమావేశాలు నిర్వహించరు. తనకు అనుకూలంగా ఉండే జర్నలిస్టులకు మాత్రమే ఇంటర్వ్యూలు ఇస్తారు. విధేయత చూపని వారిని తీవ్రంగా విమర్శిస్తారు" అని నివేదిక పేర్కొన్నది. ఇక మోడీ సర్కారును విమర్శించే భారతీయ జర్నలిస్టులు బీజేపీ అనుకూల వర్గాల ట్రోల్స్ ద్వారా వేధింపులను ఎదుర్కొన్నారని కూడా నివేదిక వివరించటం గమనార్హం.ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా స్వేచ్ఛా పత్రికా వ్యవస్థ లేదని, వార్తా మాధ్యమాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నాణ్యమైన నివేదికలను ఫణంగా పెట్టి ప్రేక్షకులను ఆకర్షించే పోటీలోకి దిగుతాయనీ, వారిని దోపిడీ చేయటానికి ప్రయత్నించే సామ్రాజ్యవాదులు, ప్రభుత్వ అధికారులకు బలైపోవచ్చని చెప్పారు.

**"డిజిటల్ యుగంలో రిపోర్టింగ్ :**

పత్రికా స్వేచ్ఛపై ఏఐ ప్రభావం" అనే అంశం ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం–2025 ఇతివృత్తమని తెలిపారు. ఏఐతో తప్పుడు సమాచారాలు, సమాచారం అందకపోవడం, డీప్‌ఫేక్ టెక్నాలజీ తిప్పలు లాంటివి కూడా ఉన్నాయి. పక్షపాత సమాచారం, జర్నలిస్టులపై నిఘా పెరగడం, పని సమానమైన వేతనాలు అందకపోవడం, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా స్వార్థపర రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లడం, పత్రికా రంగ విలువలు పలుచబడడం ఈ దశాబ్దకాలంగా పెరిగింది. ఎల్లో జర్నలిజం పురుడు పోసుకోవడం, జర్నలిస్టులపై హత్యాప్రయత్నాలు జరగడం, విలేకరుల కలం నోళ్లు నొక్కడం, జర్నలిజంలో రాజకీయాలు ప్రవేశించడం లాంటి అవలక్షణాలు కూడా ఈ కాలంలో బాగా పెరిగాయి. గుత్త పెట్టుబడిదారులు సైతం మీడియాలోకి ప్రవేశించడం అతిపెద్ద సమస్యగా పరిణమించింది. ఇలాంటి ధోరణలు, సమస్యల మధ్య పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవడమంటే కత్తిమీద సామే. నిజాయితీ కలిగిన జర్నలిస్టులపై జరిగే దాడులను ఖండించడం, అక్రమార్కుల భరతం పట్టడం, పారదర్శకత పాటించడం, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం జరగాలి. ప్రపంచ స్థాయి ఐక్యత సాధించడం, వివిధ మీడియా గ్రూపులను ఐక్యంగా కలుపుకోవడం, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించే అంతర్జాతీయ వేదికలను ఏర్పాటు చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం లాంటి అంశాలను చర్చించడం ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా అవసరమని చెప్పారు.

రాజకీయ, చట్టపరమైన, ఆర్థిక, సామాజిక అంశాలు పత్రికాస్వేచ్ఛను ప్రభావితం చేస్తున్నాయి. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు పడితే అన్యాయమే రాజ్యమేలుతుంది, పేదరికం వెక్కిరిస్తుంది. సమన్యాయం, అభివృద్ధి, రాజ్యాంగ విలువల పరిరక్షణ ఆందోళనకరంగా మారుతుంది. అందుకే పత్రికాస్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ఎంతగానో దోహదపడుతుంది. ప్రజలకు అనేక విషయాల్లో అవగాహనతో పాటు న్యాయం జరిగే విధంగా ఉంటుంది. నేటి పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, మీడియా మిత్రుల భద్రత లాంటివి రేపటి సమసమాజ స్థాపనకు ఊతమిచ్చే విధంగా ప్రభుత్వాలు ఉండాలే కానీ, గొంతునొక్కేలా వ్యవహరించకూడదని, అలా నిజాల్ని మరుగున పరిచే విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తు తరం పాలకవర్గాలను క్షమించదని వి. కృష్ణ మోహన్ హెచ్చరించారు.

**వి. కృష్ణ మోహన్**
**జాతీయ చైర్మన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్ (సీసీజీజీఓఓ)**
(M) 9182189533 **హైదరాబాద్**
**కార్యదర్శి, ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా)**
**kmdrdo@gmail.com**

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

ఆదివారం

జనరల్ న్యూస్

04-05-2025

# ఏసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి








తొవ్వ, ప్రతినిధి మే 02బీ

ప్రజలకు సౌకర్యార్థం తొర్రూర్ పట్టణంలో హైటెక్ హంగులతో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త సర్వీస్ లను లాంచ్ చేస్తూ జెండా ఊపి ప్రారంభించారు . పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఆర్టీసీ తాజాగా రెండు రాజధాని ఏసి బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు ఈ బస్సు తొర్రూర్ వయా తిరుమలగిరి,మోత్కూర్ మీదుగా హైదరాబాద్ పట్టణానికి సర్వీస్ అందించనుందని ,.తెలంగాణ ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు,హైటెక్ హంగులతో రూపొందించిన ప్రైవేట్ బస్సులకు దీటుగా రూపొందించిన ఈ బస్సులను ప్రయాణికులకు సౌకర్యం కోసం సురక్షితమైన వేగవంతమైన ఏసి బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని వెల్లడించారు. ఇప్పటికే ఆర్టీసీలో వీలైనంత సాంకేతికతను ఉపయోగిస్తున్నామని తెలిపారు, బస్సు సేవలను అందరు వినియోగించుకోవాలని కోరారు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు , ..ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్..నియోజకవర్గ నాయకులు, ఆర్టీసీ యాజమాన్యం, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు..

# ఎండ తీవ్రత కు జాగ్రత్తలు పాటిద్దాం .

## జిల్లా వైద్య అధికారి డాక్టర్. రవి రాథోడ్



తొవ్వ ,మహబూబాబాద్ ,మే 03:

జిల్లాలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్న%శీ%దున వేసవి కాలంలో తీవ్రమైన ఎండ, వేడి గాలులు వీచినప్పుడు “వడదెబ్బకు” గురయ్యే అవకాశం ఉందని ప్రజలందరూ తగిన జాగ్రతలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్. రవి రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేసవి లక్షణాలు వివరిస్తూ వేసవికాలంలో వడ దెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం (తగ్గడం), మూత్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్ళే అన్ని లక్షణాలు గాని లేక కొన్ని లక్షణాలు గాని కనిపిస్తాయని పేర్కొన్నారు. ప్రథమ చికిత్స ద్వారా వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే ఉపశమనం పొందగలరని దానికి వడదెబ్బ తగిలిన వ్యక్తి నీడ గల ప్రదేశానికి చేర్చాలని శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలని , ఎండ దెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజు, పప్పుకట్టు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగించాలని , సత్వర చర్యల కొరకు 108 అత్యవసర సేవలను సంప్రదించాలన్నారు . ప్రథమ చికిత్స చేసిన తరువాత దగ్గరలో గల ఆరోగ్య కేంద్రం/ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని తెలిపారు వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలుతీసుకోవాలని ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం/పిల్లలు ఆడటం చేయరాదన్నారు , తప్పనిసరి పరిస్థితులలో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలి, తెల్లని నూలు వస్త్రాలు ధరించాలి, నీరు ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలని , మత్తు పానీయాలు తీసుకోరాదన్నారు ముఖ్యంగా ఇంటివద్ద వుండే పిల్లలు, 60 సం.ల. పై బడిన వారు, అనారోగ్యంతో బాధపడేవారు తరచుగా మంచినీరును,ఓఆర్ఎస్ ను త్రాగలని, ఒకవేళ నోరు ఏంఎండిపోవడం దాహం వేయడం లక్షణాలు వుంటే దగ్గరలోని ఆశా కార్య కర్తను సంప్రదించాలని తెలిపారు. అలాగే బయట పనికి వెళ్ళేవారు ఉదయం 12 గంటలలోపు సాయంత్రం 4 గంటల తదుపరి పనిచేసుకొవాలని మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవాలన్నారు.ప్రతి ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రం, ఆశా కార్య కర్త వద్ద, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, గ్రామ పంచాయత్ లలో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అవసరం ఉన్నవారు ఉపయోగించుకోగలరన్నారు పైన తెలిపిన జాగ్రత్తలు పాటిస్తూ వడ దెబ్బకు గురి కాకుండా చూసుకోవాలని తెలిపారు. అంతే కాకుండా వేసవి కాలంలో వచ్చే వ్యాధుల పై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## ౧౦వ తరగతి లో మెరిసిన అరుట్ల గ్రామ విద్యార్థుల సత్కారం...




తొవ్వ, మంచాల మే 02:

ఆరుట్లలో 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి అటు తల్లిదండ్రులకు ఇటు పాఠశాలకు పేరు తెచ్చిన విద్యార్థులకు శనివారం సన్మానించారు 500కి పైగా మార్కులు సాధించిన 7 గురు విద్యార్థులైన అఖిలేశ్ %-% 564 మార్కులు ఆర్. తరుణ్ 550 మార్కులు ఎన్. శ్రీతికా 537 మార్కులు ఎన్. సౌమ్య 531 మార్కులు ఆర్. షిరిషా 517 మార్కులుజి. సమ్యుక్త 509 మార్కులు ఎన్. పల్లవి 500 మార్కులు వచ్చాయని పాఠశాల గెజిటెడ్ హెడ్మాస్టర్ శ్రీ ఎస్. గిరిధర్ గౌడ్ తెలిపారు విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కార్యక్రమంలో పాల్గొన్న పుర ప్రముఖులు అభిలషించారు .ఈ కార్యక్రమంలో ఏ ఎస్ డి ఎం సి జనరల్ సెక్రటరీ, రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీమతి పద్మజా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు పాల్గొన్నారు

## ఆవిష్కరణ కు ముందే...దర్శనం ఇచ్చిన నూకల విగ్రహం..

తొవ్వ , ప్రతినిధి మే 03:



మహబూబాబాద్-మరిపెడ జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన మాజీమంత్రి నూకల రామచంద్రారెడ్డి విగ్రహం ఆవిష్కరణకు ముందే ప్రజలకు దర్శనం ఇస్తోంది. ఇటీవల గాలిదుమ్ములకు విగ్రహానికి కప్పి ఉంచిన పై కావర్ లేచిపోగా..., నిలువెత్తు విగ్రహం హైవే పై కనిపించడంతో, వాహనదారులు, ప్రజలు, ఆసక్తిగా తిలకిస్తూ..., పోటోలు తీసుకుంటున్నారు.!! ఈయన ఎవరంటూ మరికొందరు వారి చరిత్రను అడిగి తెలుసుకుంటున్నారు...మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రారంభోత్సవసభలో అప్పటి ముఖ్యమంత్రి కేసిఆర్ ఈ..ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీమంత్రి నూకల రామచంద్రారెడ్డి రాజకీయచరిత్ర ఘనమైనదని, మాజీ ప్రధాని పివి నర్సింహారావు వంటి అనేక మందికి ఆయన గురుతుల్యులని గుర్తుచేసారు.., అలాంటి నేతను భవిష్యత్తు తరాలు మరిచిపోకుండా విగ్రహం, పార్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు..ప్రస్తుతం ఆ..పనులు పూర్తి అయ్యి ప్రారంభోత్సవానికి సిద్దంగా ఉంది...!!, తొలిగిన కవర్ ను త్వరగా కప్పి...! అదేమాదిరి వీలయినంత త్వరగా అధికారికంగా ఆవిష్కరణ కార్యక్రమం కూడా ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.




Thovva@ epapaer.com....04-05-2025, ఆదివారం

తొవ్వ

ఆదివారం

జనరల్ న్యూస్

స్పెషల్ స్టోరీ'

04-05-2025





# అడవిలో బాంబుల మోత .ఆదివాసీల గుండె కోత

## కర్రెగుట్టలో బూట్ల చప్పుడు .... ఆకలితో అలమటిస్తున్న ఆదివాసీ పల్లెలు
## నూకాలకే కష్టమవుతుంది ... మా బాధ ఎవరికీ చెప్పుకోవాలి
## ఆపరేషన్ కర్రెగుట్టల పై ఆదివాసీలపై తొవ్వ దినపత్రిక పత్యేక కథనం



తొవ్వ డెస్క్ .మే 02:

ఎటు చుసిన పచ్చని అడవులు , నీటి చెలిమలు, నెమళ్ళ అరుపులు ,పక్షుల కిల కిల రావాలు ,అమాయక ఆదివాసీల జీవన విధానము తో ముడిపడి వుంది అడవి , తెలంగాణ ప్రాంతంలో ప్రారంభమైన కర్రెగుట్టలు ఛత్తీస్ ఘడ్ వరకు విస్తరించి ప్రకృతి రమణీయతకు ఆలవాలం గా వుంది కోడి కూయంగనే లేచి ఇప్ప పూలు తునికి పండ్లు అడవిలో దొరికే ఇతర ఆహార పదార్ధాల సేకరణకు వెల్లి తెచ్చిన పదార్ధాలను సంతలో లేదా గిరిజన కార్పొరేషన్ కు అమ్మి వచ్చిన డబ్బుల తోనే కొన్ని నూకలు , బియ్యం ఇతర వంట సామాగ్రి కొనుగోలు చేసి బతికేవాళ్లం పెద్ద ఉట్ల కస్తూరి పాడు ,పూజారి కాంకేర్ చెందిన ఆదివాసీ మహిళలు తెలిపారు. తమ గ్రామం మీదుగా పోలీసులు రోజూ వెళుతుండడం, చెంతనే ఉన్న కర్రీ గుట్టలపై బాంబుల మోత వినిపిస్తుండటంతో ఎప్పుడు ఎం జరుగుతుందో అని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నామని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ గ్రామంలోనే కొంతమంది ఇప్పటికి మావోయిస్టులలో వున్నారని వారికీ ఏమైనా జరిగిందేమో అనే ఆందోళనలో చెందుతున్నారు కర్రే గుట్టలు భౌగోళికంగా ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలకుఉత్తర దక్షిణ ? దిశల్లో గోదావరి తీరం వెంబడి , దట్టమైన అభయారణ్యం తో కలిసి ఉంటుంది . తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్?లకు సరిహద్దులుగా దండకారణ్యం విస్తరించింది. మావోయిస్టులు ఇక్కడ కర్రెగుట్టలను స్థావరంగా ఏర్పాటు చేసుకున్నారనే పక్కా సమాచారంతో కేంద్రం ఆపరేషన్ కగార్ ఎటనం చేపట్టింది. గత నెల 22న కేంద్ర భద్రత బలగాలు, కోబ్రా, సీఆర్పీఎఫ్ ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఎస్‌టీఎఫ్, బస్తర్ ఫైటర్స్ బలగాలతో సరిహద్దులను చక్రబంధం చేసింది. మొదటగా 3 వేల మంది పోలీసులను రంగంలోకి దింపింది. అడవుల్లో అన్వేషణను కొనసాగిస్తుండగా వారికి సపోర్టు పార్టీలుగా మరో 2 వేల మందిని సరిహద్దుల్లో మోహరించారు వీరి బూట్ల కవాతులతో ఆదివాసీ పల్లెలు కొంత బయాందోళను కు గురవుతున్నారు . ఇది ఇలా ఉంటే నిత్యం అడవికి వెళ్ళేవాళ్ళు అడవిలో కాయో పండో తెచ్చుకున్న వాళ్ళు ఆటవికి వెళ్లలేక పనులు ఆగిపోవడంతో ఆకలితో నూకలు కొనుగోలు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు





ఇక ఏమి చేయాలో తెలియక పెద్ద ఉట్ల గ్రామస్తులు ఓ చోట చేరి అడవికి ఎప్పుడు పోవాలనో మాఅడవిలో మేమె పరాయివారం బ్దాలు వినిపిస్తున్నాయని పూజారి కంకేర్ వాసులు చెప్పారు. పూసగుప్ప తెలంగాణ ఆకారి గ్రామం తెలంగాణ పోలీసులు ఏమి చెప్పకపోవడం తో యధావిధిగా గుట్ట ప్రాంతానికి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పక్కనే పేలుడు జరిగి భారీ శబ్దం వినిపించడంతో ఆందోళనకు గురయ్యారు రు. ఇక కొన్ని గ్రామంలో మేకలు, పశువులను మేపేందుకు ఆ ప్రాంతం వైపు రావొద్దని భద్రతా బలగాలు ఆంక్షలు పెట్టారని, చేపలు పట్టుకునేందుకు కూడా పాలెం జలాశయం వద్దకు వెళితే వెనక్కి పంపించారని వాపోయారు.తామే కాకుండా నోరు లేని జీవాలు సైతం పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు అటవీ గ్రామాలపై భద్రతా బలగాల ఆంక్షలు, మీడియాకు అడ్డంకులు ఈ పరిణామాల క్రమంలో మారుమూల గిరిజన పల్లెలపై ఆపరేషన్ కగార్ ప్రభావాన్ని తెలుసుకునేందుకు శుక్రవారం తొవ్వ ప్రతినిధి ద్విచక్రవాహనంపై కర్రే గుట్టల వైపు వున్నా గ్రామాల ప్రజలను కలిసి వచ్చారు ఆ తర్వాత భయం భయంగానే అక్కడ జరుగుతున్న పరిస్థితులను వెల్లడించారు.ఈ ప్రాంత గిరిజన ప్రజలు ఎండాకాలం సమయంలో అడవిలో లభించే తునికి, మొర్రి, పాల పండ్లతో పాటు ఇప్ప పువ్వును సేకరించి అక్కడి పల్లెల్లో విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తుంటారు. వేసవి పంటైన తునికాకు సేకరణ ఈ అడవి బిడ్డలకు కీలకమైన ఆదాయ వనరు. ప్రస్తుత పరిస్థితుల్లో వారికి అడవిలో అడుగు పెట్టాలంటే తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. వంట చెరకు, చీపురు గడ్డికి సైతం పోలీసులు రావొద్దంటున్నారని ఇలాగైతే ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దండకారణ్యానికి ఆనుకొని ఉన్న వెంకటాపురం, వాజేడు మండలాల్లో 136 గ్రామాలు ఉండగా మొత్తంగా ఇక్కడ సుమారు 55 వేల మంది జనాభా నివసిస్తున్నారు. కర్రెగుట్టలను ఆనుకుని వెంకటాపురం మండలంలోని మురుమూరుకాలనీ, కృష్ణాపురం, టేకులగూడెం ముత్తారం, తిప్పాపురం, సీతారాంపురం, రాచపల్లి, కర్రివానిగుంపు, మంగవాయి, కొత్తగుంపు, పెంకవాగు, వెంట్లగూడెం, లక్ష్మీపురం, వాజేడు మండలంలోని బొల్లారం తదితర పల్లెలు ఉన్నాయి. ఈ పల్లెలన్నీ భద్రతా బలగాల ఆంక్షల మధ్య కొట్టుమిట్టాడుతూ జీవనం సాగిస్తున్నాయి.ఇప్పటికైనారాజ్యాంగం కల్పించిన ఆదివాసీ హక్కులను కాపాడుతూ అంతరించి పోతున్న ఆదివాసీ తెగలకు రక్షణ గా నిలబడాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు











తొవ్వ
ఆదివారం
జనరల్ న్యూస్
04-05-2025

# బాలుడిపై లైంగిక దాడి చేసిన యువతి

## హైదరాబాద్ జూబ్లీహిల్స్ షాకింగ్ ఘటన నిందితురాలిపై పోక్సో కేసు నమోదు

తొవ్వ హైద్రాబాద్ మే 03బీ



16 ఏళ్ల బాలుడిపై 28 ఏళ్ల యువతి లైంగికదాడికి పాల్పడింది. ఈ షాకింగ్ ఘటన హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ పీఎస్పరిధిలో జరిగింది. సదరు యువతి తన ఇంటి పక్కనే ఉన్న బాలుడికి మాయమాటలు చెప్పి లోబరుచుకుని నిత్యం తన ఇంట్లోకి తీసుకెళ్లి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడింది. ఈ విషయం బయటకు చెప్పవద్దని, చెబితే తనను రేప్ చేశావని చెప్తానని వార్నింగ్ ఇచ్చింది. దీంతో ఆ బాలుడు భయంతో కొన్నాళ్లపాటు ఎవరికీ చెప్పలేదు. ఈ క్రమంలో శృతి మించి అసభ్యకర పనులు చేయాలని యువతి ఒత్తిడి చేయడంతో వేధింపులను తట్టుకోలేక అతడు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో వారు వెంటనే పోలీసులను ఆశ్రయించ డంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.కాగా బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువతిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అదృష్టం ఉంటే ... సొత్తు దక్కేను నీకు

తొవ్వ డెస్క్ మే 03:



అదృష్టం లక్ష్మి దేవి కరుణిస్తే ఎలాటి పరిస్థితిలోనైనా ధనం నీ చెంతకు చేరుతుంది. చెక్ రిపబ్లిక్‌లోని ఈశాన్య పర్వతాల్లో ప్రకృతి రమణీయతను చూడటానికి వెళ్లిన ఇద్దరు పర్యాటకులకు ఊహించని విధంగా కోట్ల రూపాయల విలువ చేసే నిధి దొరికింది.ఈ ఇద్దరు పర్యాటకులు హైకింగ్‌కు వెళ్లినప్పుడు, వారి కాళ్లకు 598 బంగారు నాణేలు, ఆభరణాలు, పొగాకు సంచులు తగిలాయి. ఈ నిధి ప్రస్తుతం ఈస్ట్ బొహెమియన్ మ్యూజియంలో ఉంది.ఈ నాణేలు 1808వ సంవత్సరం నాటివిగా గుర్తించారు. ఫ్రాన్స్, బెల్జియం, ఒట్టోమాన్ సామ్రాజ్య కాలం నాటి ఆ నాణేలు 1921 తర్వాత ఎవరైనా దాచిపెట్టి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. వందేళ్ల క్రితమే వాటిని భూమిలో దాచి పెట్టినట్లు అంచనా వేస్తున్నారు.ఈ నిధి విలువ సుమారు రూ.2.87 కోట్లు (3,40,000 డాలర్లు) గా ఉండవచ్చని అన్నారు. హైకర్స్‌కు దొరికిన నిధి విలువలో 10 శాతం వాళ్లకు దక్కుతుంది. అంటే వారికి సుమారుగా రూ.28 లక్షల లబ్ధి చేకూరనుంది.రెండో ప్రపంచయుద్ధ సమయంలో నాజీలు ఈ నిధిని దాచి ఉండొచ్చన్న వాదన కూడా ప్రచారంలో ఉంది.

# భద్రకాళి చెరువు సందర్శించిన రాష్ట్ర మంత్రులు

## అభివృద్ధి పనులపై సమీక్ష, అమ్మవారికి ప్రత్యేక పూజలు..



తొవ్వ,ప్రతినిధి మే 02:

వరంగల్ నగరంలో ఉన్న ప్రసిద్ధ భద్రకాళి చెరువును రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సందర్శించారు వారి వెంట ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ స్థానిక శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు లు వ ే జ ర య ్యా ర ం



మొదటగా చెరువు పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు..చేరువు చుట్టూ నడక మార్గం, తీర ప్రాంత అభివృద్ధి, పర్యాటక సౌకర్యాలు, ప్రదర్శన గ్యాలరీలు, లైటింగ్ వ్యవస్థల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రులు, పనుల నాణ్యతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. ప్రజలకు ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా భద్రకాళి చెరువును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు..అనంతరం మంత్రులు, ఎమ్మెల్యే లు, ఇతర ప్రజాప్రతినిధులు, భద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మంత్రులు రాష్ట్ర ప్రజల శాంతి, అభివృద్ధి, సుభిక్షత కోసం అమ్మవారిని ప్రార్థించారు..ఈ సందర్శనలో జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు, పురపాలక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కర్రిగుట్టల్లో మరో బేస్ క్యాంప్.....

## భద్రతా బలగాల కూంబింగ్

తొవ్వ ,డెస్క్ .మే 03:



తెలంగాణ-ఛత్తీస్గఢ్ రాష్ట్రాల సరిహ ద్దులో ఉన్న కర్రిగుట్టల్లో కేంద్ర బలగాలు చేపడుతోన్న కూంబింగ్ నిర్విరామంగా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే చీమలు కూడా దూరని చిట్టడవిలో మావో యిస్టులు అమర్చిన మందుపాతరలు, ఐఈడీ బాంబులను ఐడెంటిఫై చేశాక వాటిని నిర్వీర్యం చేస్తూ భద్రతా దళాలు ముందుకు సాగుతున్నాయి. అదేవిధంగా మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న షెల్టర్లను గుర్తించి వాటిని నాశనం చేస్తున్నారు. కర్రిగుట్టల అటవీ ప్రాంతాన్ని భద్రతా బలగాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ మేరకు ధోబే కొండలు, ఈ నీలం సరాయి కొండల్లో ఫార్వర్డ్ బేస్ క్యాంపులను ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా మూడోవది ములుగు జిల్లా, వెంకటాపురం మండలం అలుబాక శివారులో ఏర్పాటు చేశారు. ఇక మావో యిస్టుల జాడను తెలుసుకునేందుకు డ్రోన్ల కోసం ప్రత్యేక సిగ్నలింగ్ టవర్లను నిర్మించారు. సీఆర్పీఎఫ్కు చెందినస్పెషల్ డాగ్ స్క్వాడ్ బృందాలతో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కర్రిగుట్టల్లో వందల సంఖ్యలో మావోయిస్టులు భూగర్భ బంకర్లు ఉన్నట్లుగా సమాచారం అందడంతో వాటి గుర్తింపునకు సీఆర్పీ ఎఫ్ దళాల వేట కొనసాగుతోంది. ఈక్రమంలో భద్రతా బలగాలకు కావాల్సిన సామగ్రిని ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా అధి కారులు పంపిస్తున్నారు.

# అమరావతి లో మోడీ ... తుస్సుమనే చిచ్చుబుడ్డి లా మాట్లాడారు

## ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు

తొవ్వ ,ప్రతినిధి మే 03:

ప్రధాని మోడీ తీరు చూస్తే చిచ్చు బుడ్డి తుస్సుమంది అనక తప్పదని కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. మోడీ అమరా వతి పర్యటనపై శనివారామ్ స్పందించారు. ఏపీ పునర్విభజన చట్టం 94(3) సెక్షన్ ప్రకారం నవ్యాంధ్ర నూతన రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రాని దేనని ఆమె చెప్పారు. విభజన చట్టంలో కేంద్రంనిధులెంతో ఇంత స్పష్టంగా పేర్కొంటే.. మరి ప్రధాని మోడీ మనకు ఇస్తున్నది ఏమిటని? ప్రశ్నించారు. ఆనాడు 2015లో మట్టి కొట్టారని, నేడు సున్నం కొట్టి వెళ్లారని సెటైర్లు వేశారు. పదేళ్ల క్రితం ఏం చెప్పి ఆంధ్రులకు తీరని ద్రోహం చేశారో.. నేడు అవే అబద్ధాలను అందంగా చెప్పి ఘరానా మోసం చేశారని ఆరోపించారు. మళ్లీ అభివృద్ధి చేస్తాం, భుజాల కలుపుతామంటూ బూటకపు మాటలు చెప్పారని మండిపడ్డారు. 5 కోట్ల మంది కలల సౌధం అమరావతికి 2015 నుంచి అన్నీ చేశామని పచ్చి అబద్ధాలు చెప్పారని ఫైర్ అయ్యారు. అన్ని ఇస్తే రాజధాని నిర్మాణ ఇంతవరకు ఎందుకు కాలేదని ప్రశ్నించారు.అప్పులు కాదు.. నిధులు కావాలి చంద్రబాబు ఆత్మ పరిశీలన చేసుకోవాలని, మోడీని నమ్మి మళ్లీ మళ్లీ మోస పోతున్నట్లు తెలుసుకోవాలని షర్మిల సూచించారు. రాజధానికి కావాల్సింది అప్పులు కాదు.. నిధులని స్పష్టంచేశారు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, చెప్పే మీరే రాజధాని నిర్మాణా నికి ఎవరిని అడిగి రూ.60వేల కోట్ల అప్పు తెస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు అంటే ప్రజల ఆస్తి అని, వాటిని అమ్మి రాజధాని ఎలా కడ తారని మండిపడ్డారు. కేంద్రం మెడలు వంచే దమ్ములేక.. భావితరాల మీద అప్పు భారం ఎందుకు మోపుతున్నారో రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారుప్రభుత్వ భూములు అంటే ప్రజల ఆస్తి అని, వాటిని అమ్మి రాజధాని ఎలా కడ తారని మండిపడ్డారు. కేంద్రం మెడలు వంచే దమ్ములేక.. భావితరాల మీద అప్పు భారం ఎందుకు మోపుతున్నారో రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# దాతృత్వానికి చాటుకుంటున్న "యాదాద్రి అనాధ ఆశ్రమం"

## వృద్దులకు పేదలకు అన్ని తానై నడిపిస్తున్న వర్కాల చంద్ర శేఖర్ .


తౌవ్వ

ఆదివారం

జనరల్ న్యూస్

04-05-2025




తౌవ్వ ,సంస్థాన్ నారాయణపూర్ , మే 03:


ఎంతో మంది అనాధ వృద్దులకు ఆపన్న హస్తం ల ఆదుకుంటూ నిలువ నీడా లేని బతుకులకు నీడై , తిండి పెడుతున్న యాదా ద్రి అనాధ ఆశ్రమం ఎంతో ఔనత్యాన్ని చాటుకుంటుంది వర్కాల చంద్రశేఖర్ సంస్థాన్ నారాయణపురం పుట్టపాక గ్రామంలో అనాధ ఆశ్రమం నడిపిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు తౌవ్వ ప్రతినిధి ఆశ్రమం పై ప్రత్యేక కథనం అందిస్తూ మూడు సంవత్సరాలు గా యద్రాద్రి అనాధ ఆశ్రమం నడుస్తుందని 15 నుంచి 20 మంది వృద్ధులకు భోజన సదుపాయం తోపాటు ఉండటానికి సౌకర్యవంతమైన గదులను ఏర్పాటుచేశారు . ఈ విషయం తెలుసుకొని చాల మంది వృద్దులు ఈ అనాధ ఆశ్రమం కి వస్తున్నారు, ఎంతో మందికి సేవ చేయాలనీ వున్నా ఆర్థిక పరిపుష్టి అంతగా లేకపోవడం తో అనాధ ఆశ్రమం నిర్వహణ కొంత భారం అవుతుందని దాతలు సహకరిస్తే ఇంకా అభివృద్ధి చేస్తాం అని శ్రీ యాదా ద్రి అనాధ ఆశ్రమం ఇంచార్జ్ - వర్కాల చంద్రశేఖర్ తెలియజేశారు

---

## తెలంగాణ చరిత్ర సంస్కృతి సంప్రదాయాలు

# తెలంగాణ ను పాలించిన మొదటి రాజవంశం ..... శాతవాహనులు

తెలంగాణ అనే పదం ఢిల్లీ సుల్తానుల కాలం నుంచి వ్యవహారంలోకి వచ్చింది. అమిర్ ఖుస్రు అనే కవి మొదటగా తెలంగాణను పేర్కొన్నాడు. ఆంధ్రుల ప్రస్తావన మొదటగా ఋగ్వేదంలో భాగమైన "ఐతరేయ బ్రాహ్మణం" లో క్రీ.పూ. 1000 కలదు.



దక్షిణ భారతదేశంలో వెలిసిన ఏకైక జనపదం - అశ్మక(నిజామాబాద్ , కరీంనగర్, ఆదిలాబాద్) దీని రాజధాని బోధన్. (మొత్తం జనపదాలు 16)క్రీ.పూ. 4 వ శతాబ్దంలో 'మొగస్తనీస్' అనే గ్రీకు రాయబారి తన "ఇండికా" గ్రంధంలో ఆంధ్రులకు ముప్పది కోటలున్న నగరాలు ఉన్నాయని, ఒక లక్ష కాల్బలం, రెండువేల అశ్విక బలం, ఒక వెయ్యి గజదళం ఉన్నాయని పేర్కొన్నాడు. ఇదే విషయాన్నీ ప్లీని కూడా పేర్కొన్నాడు. మొగస్తనీస్ చెప్పిన కోటల్లో తెలంగాణాలో బోధన్, కోటిలింగాల, ధూళికట్ట, పెద్దబంకుర్ , కొండాపూర్, ఫణిగిరి, గాజులపురి, ఇంద్రపురి గా గుర్తించారు.

కరీంనగర్ జిల్లా లోని 'పెద్దబంకుర్' లో కుమ్మరి కొలిమి ని కనుకొన్నారు. దక్షిణ భారత దేశాన్ని పరిపాలించిన తొలి ప్రధాన రాజ వంశం శాతవాహనులది. మౌర్యుల కాలంలో సామంతులుగా ఉండి కణ్వ వంశ కాలంలో స్వతంత్రం ను ప్రకటించుకున్నారు. తెలంగాణాలోని కోటిలింగాల లో వీరి పాలన ప్రారంభమై తరువాత ప్రతిష్ఠానపురం (పైతాన్ ) రాజధాని అయింది. మలిశాతవాహనుల కాలం నాటికీ ధనకటకానికి (ధాన్యకటకంగా) మార్పు చేయడం జరిగింది. శాతవాహనులు మగధ వరకు తమ దిగ్విజయ యాత్రను నిర్వహించారు.

శాతవాహనుల కంటే ముందు తెలంగాణను పరిపాలించిన రాజ్యాలు క్రీ.పూ. 3 వ శతాబ్దం నాటి భట్టిప్రోలు స్థూపం లోని 'ధాతురకాండ' శాసనాల్లో కుభీరుడనే రాజు నిగమసభ, గోష్ఠి ల సహాయంతో పరిపాలన చేసాడు. 'వడ్డెమాను శాసనం' లో రజసోమకుడు, జంటుపల్లి

వేల్పూరు శాసనంలో సరిపద , మహాసద్ , అశోకపద, శివపద ,శివమ కసద పరిపాలించినట్లు పేర్కొన్నవి. కోటిలింగాలలో గోబద్ , సమగోప , నారన , కాంవయసిరి నాణేలు దొరికాయి. "గోబద్" తెలంగాణాలో మొదటిసారిగా నాణెములు వేయించాడు. శాతవాహనుల శాసనాలు బ్రహ్మలిపిలో, పాకృత భాషలో ఉన్నాయిసుధీర్ఘకాలానికి చెందిన 24 శాసనాలు మాత్రమే దొరికాయి.నాసిక్-8, కన్హేరీ -5, కార్లే-3, భిల్సా -1, నానాఘాట్-2, మ్యాకదోని-1, చిన్నగంజాం-1, అమరావతి-2, కొడవలి-1 లభ్యమైనాయి.

నానేఘాట్ శాసనాన్ని మొదటి శాతకర్ణి భార్య రాణి నాయినిక(నాగానిక) వేయించింది. ఇది అలంకార శాసనం మాత్రమే.గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యానికి వచ్చేవరకు గల రాజులను తొలి శాతవాహనులు అని, గౌతమీపుత్ర శాతకర్ణి నుంచి చివరి రాజుల వరకు మలి శాతవాహనులు అంటారు.

శాతవాహనుల యుగం - తొలి శాతవాహనులు

శాతవాహన రాజ్యస్థాపకుడు - శ్రీముఖుడు

అందరికంటే గొప్పవాడు - గౌతమీ పుత్ర శాతకర్ణి

చివరి గొప్పవాడు - యజ్ఞశ్రీ శాతకర్ణి

శ్రీముఖుడు(క్రీ.పూ. 231-208) :

ఇతను శాతవాహన రాజ్యస్థాపకుడు

ఇతనిని పురాణాలు సింథకుడు, బలపుచ్ఛకుడు, బలి అని పేర్కొన్నాయి.

ఇతని పరిపాలన కాలం 23 సంవత్సరములు.


ఇతను మొదటగా జైన మతాన్ని స్వీకరించి చివర్లో వైదిక మతాన్ని ఆచరించాడు.

ఇతని నాణెముల మీద 'సిరి చిముక', 'సిరి చిముక శాతవాహన', 'సిరి శాతవాహన' అనే 3 పేర్లు ఉన్నాయి.

ఇతను రాఠీకులు అనే నాగ జాతి తెగను ఓడించి వారితో వివాహసంబందాలు ఏర్పరుచుకున్నాడు.

**ఇతని కుమారుడు 1వ శాతకర్ణి.**

కృష్ణుడు :




ఇతను శ్రీముఖుని సోదరుడు

ఇతని పరిపాలన కాలం 18 సం.

ఇతని 'నాసిక్' శాసనం లో శాతవాహన పాలనా పద్దతి, మౌర్యుల విధానంలో తీర్చిదిద్దినట్లు తెలుస్తుంది.

ఇతడు నాసిక్ గుహలను తొలిపించాడు. నాసిక్ లో బౌద్ధ సన్యాసుల క్షేమం కొరకు ధర్మమహాత్య అనే అధికారులను నియమించాడు. 'భాగవత' మతం ఇతనికాలంలో దక్షిణభారతదేశానికి వ్యాప్తి చెందింది.

మొదటి శాతకర్ణి :

ఇతను శ్రీముఖుని కుమారుడు.

ఇతని పరిపాలన కాలం 18 సం.




ఇతని **భార్య పేరు నాయనిక (నాగానిక)**, ఈమె వేయించిన శాసనం పేరు నానేఘాట్, దీనిపై వీరి కుమార్తె మహారతి త్రణకయిరో, కుమారులు కుమార హకుశ్రీ, కుమార శాతవాహన, వెదిశ్రీ(పెద్ద కుమారుడు) ల ప్రతిమలు ఉన్నాయి.

ఇతను రెండు అశ్వమేఘ యాగాలు, ఒక రాజసూయ యాగం, 20 క్రతువులను నిర్వహించాడు.

ఇతని బిరుదులు - అప్రతిహతచక్ర, ఏకవీర, దక్షిణ పథపతి.

'గజ' గుర్తు గల నాణేలను ముద్రించాడు.

పురాణాలూ ఇతడిని 'మహాన్', 'మల్లకర్ణ' అని పేర్కొన్నాయి.

ఇతను 'ఉజ్జయిని పట్టణ' గుర్తుతో నాణేలు ముద్రించాడు.

ఇతని సమకాలీన పాలకులు

పుష్యమిత్రశుంగుడు - మగద

ఖారవేలుడు - కళింగ

డెమిత్రియస్ - ఇండో గ్రీకు

ఇతను కళింగ ఖారవేలుడు పై దండెత్తినట్లు 'ఘుళ్ళా కళింగ జాతక' ద్వారా తెలుస్తుంది.

ఇతను తొలిసారిగా బ్రాహ్మణులకు పన్ను మినహాయింపు భూములను దానంగా ఇచ్చాడు.

వైవాహిక సంబంధాల ద్వారా రాజ్య విస్తరణ చేశాడు.

ఇతని భార్య నాగానిక తండ్రి పేరు మహారథకైరో (రాతికుల రాజు).

**2వ శాతకర్ణి**

పురాణాల ప్రకారం ఇతను 6వ రాజు

ఇతని పరిపాలన కాలం 56 సం.

ఇతను 'సాంచీ' స్థూపానికి దక్షిణ తోరణం నిర్మించాడు. 'ఆనందుడు' దక్షిణ తోరణం పై శాసనాన్ని చెక్కించాడు.

ఉత్తర భారతదేశంలో రాజ్య(పాలన) విస్తరణ చేసిన మొదటి దక్షిణ భారతదేశ రాజుగా పేర్కొంటారు.

ఇతని తరువాత లంబోదరుడు,అపీలకుడు, మేఘస్వాతి, స్వాతి, స్కందస్వాతి, మృగేంద్ర స్వాతి కర్ణి, కుంతల శాతకర్ణి, స్వాతి కర్ణి, అనే 8 మంది రాజులు పాలించారు.

అపీలకుడు పరిపాలన కాలం 12 సం. పురాణాల ప్రకారం ఇతని పరిపాలన కాలం 8 వ రాజు

కుంతల శాతకర్ణి :

ఇతని బిరుదు విక్రమార్క

పురాణాల ప్రకారం ఇతను 13వ రాజు

ఇతని ఆస్థానంలో శర్వవర్మ 'కాతంత్ర వ్యాకరణం' ను సంస్కృతంలో రచించాడు.

ఇతని ఆస్థానంలో అభివృద్ధి చెందినది

కుంతల శాతకర్ణికి 6 నెలల్లో సంస్కృతం నేర్పించింది శర్వవర్మ .

పైశాచిక భాషలో 'బృహత్కథ ను ఇతని ఆస్థానంలో రచించింది గుణాధ్యుడు.

ఇతని భార్య పేరు మలయావతి. ఈమె 'కరిర్త' అనే రతి భంగిమ కారణంగా మరణించింది.

కుంతలా శాతకర్ణి గురించి ఈ క్రింది గ్రంథాలలో పేర్కొనబడింది

1. వాత్సాయ కామ సూత్రం. (దీనిని తెలుగులోకి అనువాదం చేసినది పంచాంగుల నారాయణ శాస్త్రి )
2. రాజశేఖరుడి కావ్య మీ మాంస
3. గుణాఢ్యుడి బృహత్కథ

ఇతని తరువాత స్వాతి కర్ణి పరిపాలించాడు.

1 వ పులోమావి :

ఇతను 15వ రాజు ఇతను చెందిన సుశర్మను ఓడించి మగధను 10 సం. లు పరిపాలించాడని వాయు పురాణం పేర్కొంది.

పులోమావి ' గడ్డిలో జన్మించినవాడు' అని అర్థం.

ఇతని తరువాత పాలకుడు శివస్వాతి .

హాలుడు:

శాతవాహన చక్రవర్తులలో 17వ రాజు

ఇతను సరస్వతాభిమాని, సాహితీవేత్త


ఇతని బిరుదు కవి వత్సలుడు,

'బాణుడు' తన హర్షచరిత్రలో గాదా సప్తశతిని హాలుడు రచించాడని పేర్కొన్నాడు.

ఇతని భార్య పేరు లీలావతి

ఇతని వివాహంపై 'కుతూహలుడు' "లీలావతి పరిణయం" ను రచించాడు.

---




SRIKANTH.K
MSC.BED
MAHABUBABAD

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు
నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
8328649322, 9398236146.

తొవ్వ
సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి
ఆదివారం 4 మే 2025 పేజీలు 2

## ఆర్టీసీ జేఏసీ నేతలను చర్చలకు పిలిచే చాన్స్

### సర్కారు సమాలోచనలు

**హైదరాబాద్, మే 3:** ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన సమ్మె పిలుపును విరమింపజేసేందుకు ప్రభు త్వం సమాలోచనలు చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీసులోని 21 అంశాల్లో తక్షణం పరిష్కరించేందుకు ఆస్కారం ఉన్నవి, బడ్జెట్‌తో ముడిపడిన వాటి గురించి వేర్వేరుగా పూర్తిస్థాయిలో చర్చించారు. అధికారులు ఇచ్చిన వివరాల ఆధారంగా మంత్రి పొన్నం సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమై ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.



# రైతు ముంగిటకు శాస్త్రవేత్తలు

పెద్దపల్లి : రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించేం దుకు ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ, వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల ముంగిటకు శాస్త్ర వేత్తలు కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఈ నెల 5 నుంచి జూన్ 13 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వారాల పాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 5 నుంచి జూన్ 11 వరకు ఆరు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించను న్నారు. రాష్ట్రంలోని 415 మంది శాస్త్రవేత్తలు, 200 గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని నాలుగు మండలాల్లోని ఆరు గ్రామాల్లో ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో రైతులకు సాగు మెళకువలు, విత్తనోత్పత్తి, సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. రైతులకు ముఖ్యంగా విత్తన ఎంపిక కీలకమని గుర్తించడం, విత్తనం తీసుకున్న వెంటనే రసీదును తీసుకోవాలని తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించనున్నారు.
పంట మార్పిడి వైపు ప్రోత్సహిస్తారు. పత్తి, వరి కొయ్యలు కాల్చడంతో కలిగే నష్టాలు, అధి కంగా యూరియా(నత్రజని) వాడకంతో కలిగే దుష్ప్ర భావాలను తెలపనున్నారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట విత్తన సాగుతో కలిగే ప్రయోజనాలు, నూతన వంగ డాలు, రకాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సంబంధించిన అంశాలపై శాస్త్రవేత్తలు గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు. జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం, తారుపల్లి, ముత్తారం మండలం ముత్తారం, ఓదెల మండలం జీలకుంట, పెద్దపల్లి మండలం రాంపెల్లి, హన్మంతునిపేట గ్రామాల్లో కూనారం వ్యవసాయ పరి శోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిద్ది శ్రీధర్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం ఎంపిక చేసుకుని అవగాహన కల్పించనున్నారు. ఈ బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, ఇద్దరు బీఎస్సీ లేదా పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతున్న విద్యార్థులు, వ్యవసాయశాఖ అధికారులు ఉండనున్నారు.



# గత పాలకుల పాపమే ధరణి చట్టం

**పాన్‌గల్, మే 3:** గత పాలకు ల పాపమే ధరణి చట్టం అని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. భూ భారతి చట్టం 2025పై వనపర్తి జిల్లా పాన్‌గల్ పట్టణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు ను వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆ యన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ... గతంలో ధరణి చట్టం వల్ల విలువైన భూములు అన్యాక్రాంతం అయ్యాయని అన్నారు. ఫిర్యాదులు చేద్దామంటే ధరణిలో అవకాశాలు లేవన్నారు. అందువల్ల ధరణిలో వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని తెలిపారు. విరాసత్‌లో జరిగిన తప్పులను సరి చేసుకోవడం, జరిగిన తప్పులకు అప్పీల్ చేసుకునే అవకాశం భూ భారతిలో ఉంటుందన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... ప్రభుత్వం కొత్తగా ఏ చట్టం తీసుకువచ్చిన ఆ చట్టంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంటుందని అందుకే కొత్తగా వచ్చిన భూ భారతి ఆర్‌వో ఆర్ చట్టంపై మండల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ సైతం చట్టం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం 80 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదయ్య, డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, తహసీల్దార్ పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు భద్రత ఏర్పాట్లు

## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీపీ



పెద్దపల్లి మే 3:
రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జోన్ మంచిర్యాల పట్టణ కేంద్రంలో నేడు నిర్వహించనున్న నీట్ నిర్వహణకు మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన 04 పరీక్ష కేంద్రాలు తెలంగాణ ఆదర్శ పాఠశాల రాజీవ్ నగర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, డిగ్రీ కాలేజ్ లోని పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా , మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. మంచిర్యాల్ లో నాలుగు సెంటర్లలో నీట్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, నీట్ పరీక్ష ను ప్రశాంతమైన వాతావరణం లో నిర్వహించడం లో భాగంగా సెంటర్లను విజిట్ చేయడానికి రావడం జరిగింది అన్నారు. నాలుగు సెంటర్లలో 1224 మంది స్టూడెంట్స్ ఉన్నారు వాళ్ళకి ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సమస్య లేకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందనీ ,పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఏరియాలలో 163 బిఎన్ఎస్ఎస్ ప్రకారం నలుగురు కంటే ఎక్కువ మంది ఉండకుండా చూస్తాము. సెక్టార్ సూపర్డెంట్ తో మాట్లాడడం జరిగింది. లోపల ఉన్న అన్ని సిస్టమ్స్ ఇన్విజి లెటర్స్ అందరికీ కూడా ప్రత్యేకంగా ఇన్స్ట్రక్షన్స్ లను కమిటీ ద్వారా ఇస్తారు. పోలీస్ సిబ్బంది జాగ్రత్తగా బయట వారిని తనిఖీ చేసి లోపలికి పంపడం జరుగుతుంది. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్త్ పటిష్టంగా ఏర్పాటు చేస్తాము అని సీపీ తెలిపారు. విద్యార్థులు సెంటర్‌లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లొద్దని, విద్యార్థులకు తల్లితండ్రులు పరీక్ష కేంద్రాలకు అనుమతి సమయం కన్నా ముందుగా వచ్చి పోలీస్ వారికీ సహకరించగలరు అని సూచించారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఇన్స్పెక్టర్ పూరషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# మే 5 నుంచి మే 19 వరకు ఎలిగేడు మండలంలో రెవెన్యూ సదస్సులో నిర్వహణ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**3 బృందాలతో ప్రతి గ్రామంలో 2 రోజుల పాటు రెవెన్యూ సదస్సుల నిర్వహణ**

**భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి**

**ఎలిగేడు మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి మే -03:
ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం పైలెట్ ప్రాజెక్టు కింద పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు మే 5 నుంచి మే 19 వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎలిగేడు మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం పెద్దపెల్లి జిల్లాలోని ఎలిగేడు మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించిందని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రత్యేక అధికారిగా ఉంటూ పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 3 బృందాలను ఏర్పాటు చేసి ప్రతి గ్రామ పంచాయతీ లో 2 రోజుల పాటు రెవెన్యూ సదస్సు జరిగేలా షెడ్యూల్ రూపొందించడం జరిగిందని అన్నారు.ఎలిగేడు తహసిల్దార్ ఎం.డి బషీరుద్దీన్ ఆధ్వర్యంలోని టీం -1 ఎలిగేడు గ్రామంలో మే 5,6 తేదీలలో, లాలపల్లి గ్రామంలో మే 7,8 తేదీలలో, నారాయణ పల్లి గ్రామంలో మే 9,12 తేదీలలో, శివ పల్లి గ్రామంలో మే 13,14 తేదీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు.కలెక్టరేట్ సూపరింటెండెంట్ (తహసిల్దార్ క్యాడర్) బి.యక్కన్న ఆధ్వర్యంలో టీం-2 బుర్హాన్ మియాపేట గ్రామంలో మే 5,6 తేదీలలో, నర్సాపూర్ గ్రామంలో మే 7,8 తేదీలలో, సుల్తాన్ పూర్ గ్రామంలో మే 9,12 తేదీలలో, లోకాపేట గ్రామంలో మే 13,14 తేదీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. కలెక్టరేట్ నాయబ్ తహసిల్దార్ ధీరజ్ కుమార్ ఆధ్వర్యంలో టీం-3 దూళికట్ట గ్రామంలో మే 9,12 తేదీలలో, ర్యాకాదేవపల్లి గ్రామంలో మే 13,14 తేదీలలో , రాముల పల్లి గ్రామంలో మే 15,16 తేదీలలో, ముప్పిరి తోట గ్రామంలో మే 17,19 తేదీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సమస్యల పరిష్కారం పై ఎలిగేడు మండలంలోని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఎలిగేడు మండలంలో భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలలో డబ్బు చాటింపు ద్వారా ప్రచారం చేయాలని, రెవెన్యూ సదస్సుల అంశం ప్రతి ఒక్కరికి తెలిసేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్,ఎలిగేడు తాహసిల్దార్ బషీరో ద్దీన్ ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సందర్శన వేళలో మార్పు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి మే -03:
సమీకృత జిల్లా కలెక్టరేట్లో వివిధ సమస్యల పై ప్రజలు కలెక్టర్ ను నేరుగా కలిసే సందర్శిన వేళల్లో స్వల్ప మార్పు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు కార్యాలయ పని దినాలలో సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాను అందుబాటులో ఉంటానని, వివిధ సమస్యలు, పనులు ఉన్న సందర్శకులు, ఫిర్యాదుదారులు, ప్రజలు ఆ సమయంలో నేరుగా తనను కలవోచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కు వివిధ సమస్యలపై దరఖాస్తులు సమర్పించాలనుకునే వారు విజిటింగ్ సమయంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ కు రావాలని, మిగిలిన సమయాల్లో వచ్చి, వేచి ఉండి తమ సమయాన్ని వృధా చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### జాతీయ స్థాయి పురస్కారం

# అందుకున్న గొల్లపెల్లి నరేష్

## సమాజ సేవలకు గుర్తింపు




చొప్పదండి, మే3 : సమాజంలో తాను అందిస్తున్న సేవా కార్యక్రమాలకు గాను యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సంస్థ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా చొప్పదండి మండలం భూపాల పట్నం గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, బ్లడ్ డొనేషన్ మోటి వేటర్ గొల్లపెల్లి నరేష్ కు జాతీయ యంగ్ ఇండియన్ సేవా పురస్కారం అందచేశారు. ఈ అవార్డును హైదరాబాద్ నెహ్రూఆడిటోరియం లో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ఐ .ఏ .ఎస్ .చేతులమీదుగాఅందుకున్నారు. ఈకార్యక్రమంలో ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండర్, ప్రెసిడెంట్ జే.బాలు మాట్లాడుతూ సంస్థ సభ్యులు నరేష్ చేస్తున్న సమాజ సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని కోరారు. పురస్కార గ్రహీత నరేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామజిక బాధ్యత కలిగి ఉంటూ,వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని అన్నారు.


# మేడే స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడుదాం



జమ్మికుంట,మే3 :
మేడే ఉత్సవాల్లో భాగంగా అఖిలభారత కార్మిక సంఘాల కేంద్రం ఎ ఐ సి టి యు జమ్మికుంట ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మేడే జెండా ను కొత్తపల్లి లో శనివారం ఆవిష్కరణ చేశారు... జెండా ను కార్మిక నాయకులు వలిపిరెడ్డి లింగస్వామి ఆవిష్కరణ చేశారు. అనంతరం కామ్రేడ్ సరోజ మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర బిజెపి ప్రభుత్వం కాలరాయాలని అనేక కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకుని వచ్చింది అని, పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడులు గా మార్చి సంఘటిత, అసంఘటిత కార్మికులను దోపిడీ చేస్తున్న తీరు కు వ్యతిరేకంగా మేడే స్ఫూర్తి తో పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంద భద్రయ్య, వల్లెపు నవిత, వలిపి రెడ్డి లక్ష్మి, పిట్టల తిరుపతి, యం డి అఫ్జల్, ఆడెపు రాజనర్సు , పి. మహేష్, పిట్టల సుజాత,శనిగరపు లత, లత,శారద, సునిత సి హెచ్ శ్రీనివాస్,యం.శ్యాం తదితరులు పాల్గొన్నారు...

# కృత్రిమ మేధ వినియోగిస్తూ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి మే 03:
కృత్రిమ మేధా సాంకేతికతను సమర్ధవంతంగా వినియోగిస్తూ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కృత్రిమ మేధ వినియోగిస్తూ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. కృత్రిమ మీద వినియోగిస్తూ ఆవుల ఆరోగ్య పరిరక్షణ అంశం పై తీసుకునే చర్యల గురించి నీర్ ఇంటరాక్టివ్ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలోని కమాన్ పూర్, రామగిరి, మంథని ,ముత్తారం మండలాల్లో ఉన్న ఆవుల ఆరోగ్య పరిరక్షణకు ప్రయోగాత్మకంగా కృత్రిమ మేధ ను వినియోగించుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 4 మండలాల్లో ఉన్న ఆవుల వివరాలు, వాటి యజమాన్య రైతుల వివరాలు సేకరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆవులను పరిశీలించి కృత్రిమ మేధను వినియోగిస్తూ ఆవులకు వచ్చే గాలికుంట, లంగ్ ఇన్ఫెక్షన్ మొదలగు రోగాలను ముందుగానే గుర్తించి అవసరమైన చికిత్స అందజేయడం ద్వారా ఆవుల సంరక్షణకు బాటిల్ వేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్,మీరు ఇంటరాక్టివ్ సంస్థ సీఈఓ జయశంకర్, పాల్గొన్నారు.